ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

3

చిత్తూరు జిల్లా వార్తలు

గురువారం 15 ఆగస్టు 2024

రాజ్‌భవన్‌లో తేనీటి విందుకు శెట్టిపల్లె సర్పంచి



స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం విజయవాడలోని రాజ్‌భవన్‌లో ఎట్ హోం కార్యక్రమం జరగనుంది. ఈ సందర్భంగా గవర్నర్ నజీర్ అహ్మద్ ప్రముఖులకు ఇచ్చే తేనీటి విందుకు గుడుపల్లె మండలం శెట్టిపల్లె సర్పంచి రీటా ఎల్లప్పకు ఆహ్వానం అందింది. జిల్లానుంచి ఈమె ఒక్కరే ఈ గౌరవానికి ఎంపికయ్యారు. పంచాయతీలో జరిగిన అభివృద్ధి పనులు, ప్రజా చైతన్య కార్యక్రమాలకు మెచ్చి రీటాను ఈ కార్యక్రమానికి ఎంపిక చేశారు. కాగా, ఆమె బుధవారం విజయవాడ బయలుదేరి వెళ్లారు.

– కుప్పం

భర్త ఎల్లప్పతో సర్పంచి రీటా

రిహార్సల్స్

చిత్తూరులోని పరేడ్ మైదానంలో స్వాతంత్ర్య దిన వేడుకల ఏర్పాట్లను బుధవారం ఎస్పీ మణికంఠ పరిశీలించారు. గురువారం నాటి గౌరవ వందనం స్వీకరించే కార్యక్రమాన్ని రిహార్సల్స్ నిర్వహించారు. ఏర్పాట్లకు సంబంధించి పలు సూచనలు చేశారు.

– చిత్తూరు కలెక్టరేట్



ఢిల్లీలో కుప్పం రైతు

కుప్పం మండలం వెండుగంపల్లెకు చెందిన మహిళా రైతు ఎస్. మునిలక్ష్మి ఢిల్లీ చేరారు. ఢిల్లీలో ఎర్రకోటలో ఆగస్టు 15న కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకలకు పీఎం కిసాన్ లబ్ధిదారు అయిన మునిలక్ష్మికి అతిథిగా ఆహ్వానం అందిన విషయం తెలిసిందే. రాష్ట్రంనుంచి ఎంపికైన నలుగురు మహిళా రైతుల్లో ఈమె ఒకరు. తన భర్త నారాయణతో కలిసి ఆమె బుధవారం ఢిల్లీకి చేరారు.రాష్ట్ర ప్రభుత్వ అధికారులు మునిలక్ష్మి జంటను కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు వద్దకు తీసుకెళ్లారు. వీరిని ఆయన అభినందించారు.

– కుప్పం



కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడితో మునిలక్ష్మి దంపతులు







పరేడ్ మైదానంలో సిద్ధమైన వివిధ శాఖల స్టాళ్లు.. వీక్షకుల కోసం గ్యాలరీ.. రంగవల్లులు తీర్చిదిద్దుతున్న మహిళలు

జెండా పండుగకు ముస్తాబు

- నేడు మంత్రి సత్యకుమార్‌చే పతాకావిష్కరణ
- అరగంట ముందే వేడుకలు ప్రారంభం
- 400 మందికి ప్రశంసాపత్రాల ప్రదానం

ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న డ్వామా పీడీ రాజశేఖర్



చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14: స్వాతంత్ర్య దిన వేడుకలకు చిత్తూరులోని పోలీసు పరేడ్ మైదానం సిద్ధమైంది. పరేడ్ మైదానాన్ని రంగవల్లులతో తీర్చిదిద్దారు. ప్రత్యేక అతిథులు, అవార్డుగ్రహీతలు, మహిళలు, ప్రజల కోసం వేరువేరుగా సీటింగ్ అరేంజ్‌మెంట్స్ చేశారు. ఏటా ఉదయం 9.05 గంటలకు ప్రారంభమయ్యే పతాకావిష్కరణ కార్యక్రమం ఈసారి అరగంట ముందుగానే ప్రారంభమౌతుంది. గురువారం ఉదయం 8.35 గంటలకు ప్రశాంత్‌నగర్ వద్ద ఉన్న పోలీసు పరేడ్ మైదానంలో రాష్ట్ర మంత్రి సత్యకుమార్ యాదవ్ జాతీయ పతాకాన్ని ఎగురవేస్తారు. పోలీసులిచ్చే గౌరవవందనాన్ని స్వీకరించి, పరేడ్‌ను తనిఖీ చేస్తారు. అనంతరం జిల్లాప్రగతిని వివరిస్తూ ప్రజలను ఉద్దేశించి మంత్రి సందేశాన్నిస్తారు. ఎంపిక చేసిన తొమ్మిది ప్రభుత్వ శాఖలచే అభివృద్ధి కార్యక్రమాలు వివరిస్తూ శకటాల ప్రదర్శన కొనసాగుతుంది. పలువిద్యాసంస్థల విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి. విధినిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరచిన 50 మంది అధికారులతో పాటు 400 మంది ఉద్యోగులు, సిబ్బందికి మంత్రి ప్రశంసాపత్రాలు బహూకరిస్తారు. వీరిలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణలో ఉత్తమ తీరు కనబరచిన 50 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. పరేడ్ మైదానంలో 12 శాఖలు ఏర్పాటుచేసిన స్టాళ్లను సందర్శించిన అనంతరం లబ్ధిదారులకు మంత్రిచే ఆస్తుల పంపిణీ జరుగుతుంది.

స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ప్రతీక





రామకుప్పం, ఆగస్టు 14: బ్రిటీష్ సామ్రాజ్యవాదుల నుంచి స్వేచ్ఛా, స్వాతంత్ర్యాలు పొందిన వేళకు రామకుప్పం మండలం బందార్లపల్లె లోని స్వాతంత్ర్య సిద్ధ్యతా స్థూపం ప్రతీకగా నిలుస్తోంది. 1947 ఆగస్టు 15న భారతదేశాకి స్వాతంత్ర్యం వచ్చిన సందర్భంగా.. బందార్లపల్లెకు చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు, మాజీ సర్పంచు దొడ్డేగౌడు స్పందించారు. ఆ రోజు గ్రామస్థులు, యువకులతో కలిసి గ్రామంలో స్వాతంత్ర్య సిద్ధ్యతా స్థూపం ఏర్పాటు చేశారు. అప్పట్లో బందార్లపల్లె గ్రామంతో పాటు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తండోపతండాలుగా తరలివచ్చి సంబరాలు చేసుకున్నారు. అక్కడి రాతి స్థూపం కింద ఓ నల్లరాతి శిలాఫలకాన్ని కూడా ఏర్పాటు చేశారు. ఆ శిలాఫలకం పై భాగంలో హిందీలో ఓం అని, తెలుగులో శ్రీవందేమాతరమ్, జైహింద్, స్వాతంత్ర్య సిద్ధ్యతా భారత మహాదేశము అని లిఖించారు. ఇంకా 'క్రీ.శ 1947 ఆగస్టు 14 గురువారం అర్ధరాత్రి 12గంటల 9నిమిషాల 57సెకన్లకు వృషభలగ్నంలో ఆంగ్లేయులు భారత స్వాతంత్ర్యము అప్పగించి వెళ్ళిపోయిరి' అని రాసి ఉంది.

బందార్లపల్లెలోని స్వాతంత్ర్య సిద్ధ్యతా స్థూపం.. కిందిభాగంలో శిలాఫలకం



స్వాతంత్ర్య సమరయోధులకు సన్మానం

పలమనేరు, ఆగస్టు 14: పలమనేరులో బుధవారం స్వాతంత్ర్య సమరయోధులను సన్మానించారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా పలమనేరు మాజీ ఎమ్మెల్యే, స్వాతంత్ర్య సమరయోధుడు టీసీ రాజన్‌ను, దివంగత రామమూర్తి సతీమణి జయలక్ష్మమ్మను వారి ఇళ్ల వద్దకు వెళ్లి మున్సిపల్ కమిషనరు రమణారెడ్డి, మేనేజర్ ఖాదర్‌మొహిద్దీన్ ఘనంగా సన్మానించారు. ఈకార్యక్రమాల్లో వారి కుటుంబ సభ్యులు కూడా పాల్గొన్నారు. బెంగళూరులో ఉంటున్న టీసీ రాజన్‌ను మున్సిపల్ అధికారులు ఆహ్వానించడంతో ఆయన బుధవారం పలమనేరుకు వచ్చారు. వయోభారం కారణంగా ఆయన ఎక్కువగా మాట్లాడలేక పోతున్నారు.



స్వాతంత్ర్య సమరయోధులు రామమూర్తి సతీమణి జయలక్ష్మిని, టీసీరాజన్‌ను సన్మానిస్తున్న కమిషనరు రమణారెడ్డి తదితరులు

సర్దుబాటులో అడ్డదారులు..!


- పోస్టుల కోసం టీచర్ల పాట్లు
- డ్రాపౌట్ల నమోదులో తిరకాసు

విచారణాధికారిగా డీవైఈవో

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 14: విద్యాశాఖలో మరో రెండు రోజుల్లో టీచర్ల సర్దుబాటు ప్రక్రియ ప్రారంభం కానుంది. కాగా తాము పనిచేస్తున్న పాఠశాలల్లో స్థానాలు పదిలం చేసుకునేందుకు కొందరు టీచర్లు అడ్డదారుల్లో వెళ్లడం విమర్శలకు దారి తీస్తోంది. పీపుల్ టీచర్ రేషియో (పీటీఐ) ఆధారంగా చేపట్టే ప్రక్రియలో నిర్ణీత విద్యార్థుల సంఖ్య కంటే టీచర్లు అధికంగా ఉంటే వారిలో జూనియర్ టీచర్లను సర్‌ప్లస్ కేటగిరిలో చూపిస్తారు. వీరిని విద్యార్థులు అధికంగా ఉండే సమీపంలోని పాఠశాలకు పనిసర్దుబాటు కింద బదిలీ చేస్తారు. కాగా, చిత్తూరు నగరంలోని కట్టమంచి మున్సిపల్ పాఠశాల ఉపాధ్యాయులు తమ పోస్టులను అక్కడే పదిలం చేసుకునేందుకు ఎంచుకున్న మార్గం విద్యాశాఖలో గందరగోళానికి దారి తీస్తోంది. ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య లేకపోవడంతో నగరంలోని గాండ్లపల్లి మున్సిపల్ పాఠశాలలో డ్రాపౌట్ బాక్స్‌లోని 12 మందికి పైగా విద్యార్థులను తమ పాఠశాల చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేసి పోస్టులు కాపాడుకునేందుకు చేసిన యత్నం బెడిసి కొట్టింది. హెచ్‌ఎం పిన్ నంబరు లేకుండా ఒక పాఠశాల డ్రాపౌట్ బాక్స్‌లోని పిల్లల్ని మరో పాఠశాల చైల్డ్‌ఇన్ఫోలో నమోదు చేయడానికి వీలులేదు. అయితే పోస్టులు కాపాడుకునేందుకు ఈ రెండు పాఠశాలల మధ్య చోటు చేసుకున్న వ్యవహారం విద్యాశాఖను కుదిపేస్తోంది. దీనిపై డీఈవో దేవరాజును వివరణ కోరగా, చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్‌ను విచారణ చేపట్టాలని మౌఖిక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. నివేదిక ఆధారంగా బాధితులపై చర్యలు తీసుకుంటామని డీఈవో స్పష్టం చేశారు. కాగా బుధవారం చిత్తూరు ఎంఈవో 1 సెల్వరాజు, ఎంఈవో 2 మోహన్ ఆయా పాఠశాలల్లో ప్రాథమిక విచారణ చేపట్టినట్లు సమాచారం.

యాంగిల్ మారిందా!
గ్రానైట్ మాయమైందా!!

కుప్పం, ఆగస్టు 14: కుప్పం మండలం కృష్ణదాసనపల్లె క్వారీ వద్ద మంగళవారం కనిపించిన దృశ్యం.. బుధవారం కనిపించలేదు. ప్రదేశం మొత్తం పరుచుకున్న క్వారీ బండలు 24 గంటల వ్యవధిలో మాయమైపోయాయి. వివరాలిలా ఉన్నాయి. కృష్ణదాసనపల్లె వద్ద పర్మిట్లు లేకున్నా, క్వారీ రహస్యంగా నడుస్తుండడమేకాక, ఇక్కడినుంచి క్వారీ బండలు అక్రమంగా ఇతర రాష్ట్రాలకు తరలివెళ్తున్నాయని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు. ఇదే విషయాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన 'అయినా ఆగలేదు' అన్న కథనంలో ప్రస్తావించాం. ఈ విషయాన్ని నిరూపించే ఫొటోలు కూడా ప్రచురితమయ్యాయి. ఈ ఫొటోల్లో క్వారీ నడుస్తున్న ఆనవాళ్లు లేవు కానీ, క్వారీ బండలు పరచుకుని ఉండడం స్పష్టంగా కనిపిస్తోంది. మండల తహసీల్దారు చిట్టిబాబు ఈ కథనంపై స్పందించారు. బుధవారం సాయంత్రానికి రెవెన్యూ సిబ్బందిని తీసుకుని డీకేపల్లె వద్ద క్వారీ ఉన్న ప్రదేశానికి చేరుకున్నారు. క్వారీ ప్రాంతాన్ని తనిఖీ చేస్తున్నట్లు ఆయన పెట్టిన ఫొటోలో ఆశ్చర్యంగా క్వారీ బండలు కనిపించలేదు. అందుకనే ఇక్కడ ఎటువంటి క్వారీయింగ్ జరగలేదని 'ఆంధ్రజ్యోతి'కి తహసీల్దారు వాట్సాప్ ఎలో మెసేజ్ పెట్టారు. అయితే ఆయనకు తెలియని విషయం ఏమిటంటే 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన ఫొటోలు కూడా తహసీల్దారు తనిఖీ చేసిన ప్రాంతానివే. ఆ ఫొటోలు మంగళవారం సాయంత్రం తీసినవి. అందులో అక్కడ పరుచుకున్న క్వారీ బండలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కానీ బుధవారం సాయంత్రం తహసీల్దారు వెళ్లే సమయానికి ఆశ్చర్యంగా మాయమైపోయాయి. లేదా అధికారులు బుధవారం తీసిన ఫొటో యాంగిల్ మారిందేమో? కేవలం 24 గంటల్లో బండలు ఎలా మాయమైపోయాయో, క్వారీ సృష్టర్లకు, అధికారులకే తెలియాలి.



కృష్ణదాసనపల్లె క్వారీ ప్రాంతంలో తహసీల్దారు చిట్టిబాబు బుధవారం తనిఖీల సమయంలో తీసి పంపిన ఫొటో



అదే ప్రాంతంలో మంగళవారం సాయంత్రం 5.41 గంటలకు తీసిన ఫొటో. ఆ సమయంలో ఉన్న క్వారీ బండలు

అధికారులు గప్‌చుప్

మరోవైపు, గుడ్లనాయనిపల్లె పంచాయతీ ఊరినాయని కొత్తూరు వద్ద గ్రామస్థులు పోలీసులకు పట్టించి ఇచ్చిన అక్రమ క్వారీ రవాణా లారీ విషయంలో అధికారులు మంగళవారమే కాదు, బుధవారం కూడా స్పష్టత ఇవ్వలేదు. ఈ క్వారీ రవాణాకు అనుమతులు ఉన్నాయో లేవో, అది ఏ ప్రాంతంనుంచి ఏ ప్రాంతానికి తరలించడానికి ప్రయత్నాలు జరిగాయో, సొత్తు ఎవరి తాలూకానో స్పష్టత రాలేదు. దీనిపై వివరణ కోరడానికి మైనింగ్ పలమనేరు ఏడీ వేణుగోపాల్‌కు ఫోన్ చేయగా ఆయన ఫోన్ తీయలేదు. క్వారీ బండలు లారీలో తరలింపునకు సంబంధించి అధికారులు ఇకనైనా స్పష్టమైన వివరణ ఇచ్చి, ప్రజలకు ఉన్న అనుమానాలను తొలగించాల్సిన అవసరం ఉంది. ఒకవేళ ఊరినాయనికొత్తూరు నుంచి క్వారీ బండలు తరలిస్తూ గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించిన లారీకి అన్ని అనుమతులు ఉంటే, ఆ విషయం చెప్పేస్తే అందరి అనుమానాలు నివృత్తి అయిపోతాయి కదా.

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి అనర్హత కేసు 9కి వాయిదా

పుంగనూరు, ఆగస్టు 14: పుంగనూరు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని అనర్హుడిగా ప్రకటించాలని దాఖలైన కేసు విచారణ సెప్టెంబరు 9వ తేదికి హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ వాయిదా వేశారు. ఎన్నికల అఫిడవిట్‌లో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆయన భార్య స్వర్ణలతకు చెందిన 142 ఆస్తుల వివరాలు పొందపరచలేదని, ఆయనను అనర్హుడిగా ప్రకటించాలని బీసీవైపార్టీ అధ్యక్షుడు బోడే రామచంద్రయాదవ్ గత నెల 4వ తేదీన హైకోర్టులో కేసు దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ కేసుకు సంబంధించి బుధవారం విచారణ జరిగింది. పుంగనూరు అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులందరికీ కేసుపై అవగాహన కోసం నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. గత వాయిదాలోనే గెలుపొందిన వారి తర్వాత అధికంగా ఓట్లు వచ్చిన పుంగనూరు టీడీపీ అభ్యర్థి చల్లా రామచంద్రారెడ్డిని ఈకేసులో ఇంప్లీడ్ కావాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. వైసీపీ అభ్యర్థిగా పోటీ చేసి ఎమ్మెల్యేగా గెలుపొందిన మాజీ మంత్రి పెద్దిరామచంద్రారెడ్డికి అఫిడవిట్ దాఖలు చేయాలని నోటీసు పంపాలని, వచ్చేనెల 9వ తేదికి విచారణను వాయిదా వేస్తూ హైకోర్టు జడ్జి ఆదేశించారు.

రాగానిపల్లె భూమిపై 30న సీసీఎల్ఏ కమిషన్‌లో విచారణ

పుంగనూరు, ఆగస్టు 14: పుంగనూరు మండలం రాగానిపల్లె సర్వే నెంబరు 22లోని 982.48 ఎకరాల భూమికి సంబంధించి రైత్వారీపట్టా మంజూరు అభియోగంపై ఈనెల 30 సీసీఎల్ఏ కమిషన్‌లో విచారణ జరుగుతుందని తహసీల్దార్ రాము బుధవారం తెలిపారు. ఈ భూములకు సంబంధించి మంగళగిరి సర్వే సెటిల్‌మెంట్ ల్యాండ్ రికార్డుల కమిషన్‌లో రివిజన్ పిటిషన్ నెంబరు 1/24లో ప్రతివాదులుగా ఉన్న 25మంది 30వతేది మధ్యాహ్నం 3గంటలకు విచారణ అధికారి ఎదుట హాజరు కావాలని కోరారు.

మద్యం తాగి '108' నడిపిన పైలెట్

నగరి ఆగస్టు14: ప్రాణాలు కాపాడటానికి ఏర్పాటు చేసిన 108 వాహనాన్ని మద్యం తాగి నడిపి పట్టుబడ్డాడో వ్యక్తి. వివరాలిలా ఉన్నాయి. నింద్ర, విజయపురం మండలాల 108 వాహన రిలీవర్ పైలెట్‌గా కిశోర్ పని చేస్తున్నాడు. బుధవారం ఉదయం ఇతడు 108 వాహనాన్ని నడుపుతున్నాడు. అదే సమయంలో అన్నాదొరై అనే వ్యక్తి మోటార్‌సైకిల్‌పై వెళుతున్నాడు. నగరి పరిధిలోని ఓం శక్తి ఆలయం వద్ద 108 వాహనం ఒక్కసారిగా బైకు మీదకు వెళ్లింది. అన్నాదొరై చాకచక్యంగా పక్కకు వెళ్లడంతో ప్రమాదం తప్పింది. వాహనం నడుపుతున్న తీరును చూసిన స్థానికులు వెంటనే పోలీసులకు సమాచారమిచ్చారు. వారు వాహన డ్రైవరు కిశోర్‌ను అదుపులోకి తీసుకుని పరీక్షించారు. ఆ సమయంలో అతడు మద్యం తాగినట్లు బయట పడిందని సీఐ సురేష్ తెలిపారు. ఆపద్బంధులాంటి వాహనంలో పనిచేస్తూ తాగి నడపడమేంటని స్థానికులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

నేడు మంత్రి సత్యకుమార్ రాక

చిత్తూరు కలెక్టరేట్, ఆగస్టు 14: రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖామంత్రి సత్యకుమార్ గురువారం నగరానికి వస్తున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6.30 గంటలకు మంత్రి తిరుపతి నుంచి రోడ్డు మార్గాన బయలుదేరి 7.30 గంటలకు చిత్తూరు చేరుకుంటారు. పోలీసు పరేడ్ మైదానంలో జరిగే స్వాతంత్ర్య దిన వేడుకల్లో ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. జాతీయ జెండా ఎగురవేస్తారు. అనంతరం స్థానికంగా ఏర్పాటుచేసిన వివిధ కార్యక్రమాల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చిత్తూరు నుంచి తిరుపతి బయలుదేరి వెళ్తారని కలెక్టర్ పేర్కొన్నారు.

జైళ్ల శాఖకు మరో పెట్రోలు బంకు



పలమనేరు, ఆగస్టు 14: జైళ్ల శాఖ ఆధ్వర్యంలో మరో పెట్రోలు బంకుకు భూమి పూజ జరిగింది. పలమనేరు నడిబొడ్డున వృథాగా ఉన్న ఆ శాఖ స్థలంలో ఐవోసీ పెట్రోలు బంకు ఏర్పాటుకు బుధవారం జైళ్లశాఖ ఐజీ శ్రీనివాసరావు భూమి పూజ చేశారు. ఇది ఉమ్మడి జిల్లాకు సంబంధించి జైళ్లశాఖ నిర్వహించే రెండో పెట్రోలు బంకు అని తెలిపారు. పలమనేరులో జైలు మూత పడినందున కొత్తగా మోడల్ జైలు నిర్మాణానికి స్థల సేకరణ కూడ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో జైళ్లశాఖ డీజీ ఎం. వరప్రసాద్, జిల్లాజైళ్ల అధికారి వేణుగోపాల్‌రెడ్డి, జైలర్ అప్పలనారాయణ, ఐవోసీ సీనియర్ మేనేజర్ మణికాంత్, సేల్స్‌మేనేజర్ అమన్ తదితరులు పాల్గొన్నారు.

పలమనేరు
కుప్పం/పుంగనూరు

కేజీబీవీని తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి



కుప్పం, ఆగస్టు 14: కుప్పంలోని కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయాన్ని బుధవారం కుప్పం జూనియర్ సివిల్ జడ్జి ఆరీఫా షేక్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇక్కడి విద్యార్థులకు అందు తున్న వసతులు, ఆహారం, మరుగుదొడ్లు, వైద్య సదు పాయం, దుస్తులు వంటి వివరాలను ఆరా తీశారు. ఆయా అంశాలను స్వయంగా పరిశీలించారు. స్టాక్ రూమ్‌లో సరుకులను పరిశీలించారు. సెక్యూరిటీ విషయంలో పోలీసుల తనిఖీలు జరుగుతున్నాయో లేదో ఆరా తీశారు. వసతి గృహంలో ఏవైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని విద్యార్థులను కోరారు. అనంతరం జడ్జి మాట్లా డుతూ విద్యార్థులకు ఆహారంతో సహా అన్నిరకాల వసతులు కల్పించాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు.

టమోటా ప్రాసెసింగ్ యూనిట్ కోసం భూపరిశీలన



రామకుప్పం, ఆగస్టు 14: మండలంలోని చెల్దిగానిపల్లె రైతు సహకార సంఘానికి మంజూరైన టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు కోసం బుధవారం రామకుప్పం పట్టణ శివార్లలోని తిమ్మసముద్రం వద్ద గల భూములను టీడీపీ నేతలు పరిశీలించారు. సర్వేయర్ సురేష్, రెవిన్యూ సిబ్బందితో అక్కడి ప్రభుత్వ భూములను సర్వే చేసి గుర్తించారు. భూములను పరిశీలించిన టీడీపీ నాయకులు మాట్లాడుతూ రూ.8.42 కోట్లతో టమోటా ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఆ భూముల్లోనే తహసీల్దారు కార్యాలయం, పోలీస్‌స్టేషన్ల నిర్మాణానికి అధికారుల ద్వారా ప్రతిపాదనలు పంపుతామని వివరించారు. టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ చిన్నికృష్ణ, తెలుగు యువత మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు విశ్వనాథ్, వెంకటాచలం, నాయకులు రామ్మూర్తి, నాగభూషణం పాల్గొన్నారు.

175వ రోజుకు చేరిన అన్నక్యాంటీన్ నిర్వహణ



రామకుప్పం, ఆగస్టు 14: రామకుప్పంలో ఎన్టీయార్ ట్రస్టు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నక్యాంటీన్ నిర్వహణ బుధవారానికి 175వ రోజుకు చేరుకుంది. కాగా రామకుప్పంలో త్వరలోనే ప్రభుత్వం తరఫున అన్నక్యాంటీన్‌ను ఏర్పాటు చేసేలా కృషి చేస్తామని టీడీపీ నాయకులు పేర్కొంటున్నారు.

డిగ్రీ ఫలితాలలో ఐఆర్‌ఎం విజయభేరి



ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులతో చైర్మన్ దయానిధి

కుప్పం, ఆగస్టు 14: బుధవారం విడుదలైన ఎస్వీయూ డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో ఐఆర్‌ఎం కళాశాల విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిం చినట్లు కళాశాల చైర్మన్ బీఎం.దయానిధి తెలిపారు. బీకామ్ (సీఏ) విభాగంలో స్నేహ 10కి 9.15 పాయింట్లు, బీఎస్సీ (ఎంపీసీఎస్)లో సి.పునీత్ 9.45, బీబీయేలో ఎస్‌ఎం.లావణ్య 9.2, బీఎస్సీ (బీజడ్సీ)లో బి.అర్చన 8.85 పాయింట్లు సాధించి ప్రతిభ కనబరిచారని పేర్కొన్నారు. ఇంకా తమ విద్యార్థులు కె.కౌసల్య, బి.భూమిక, నివేద, సరస్వతి, రుచిత, సురేఖ, బి.ఆయేషా, సుభద్రలు అత్యధిక పాయింట్లు సాధించినట్లు వివరించారు.

డెంగ్యూ జ్వరాలపై అవగాహన

పుంగనూరు రూరల్, ఆగస్టు14: డెంగ్యూ జ్వరాలపై హోమియోపతి అసిస్టెంట్ నాగేనాయక్ పట్టణంలోని బాలికోన్నతపాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. హోమియో మందులు పంపిణీ చేశారు. హెచ్‌ఎం రుద్రాణి పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం

గుడుపల్లె, ఆగస్టు 14: పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యంగా ఉండవచ్చునని ప్రభుత్వ జూని యర్ కళాశాల ప్రిన్సిపాల్ రామకృష్ణమనాయుడు పేర్కొన్నారు. బుధవారం ప్రభుత్వ జూని యర్ కళాశాల జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో విద్యార్థులు కళాశాల పరిసరాలను శుభ్రం చేశారు. ఏపుగా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. చెత్తను తీసివేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ రమేష్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యాలయం ప్రారంభం



గుడుపల్లె, ఆగస్టు 14: ద్రావిడ విశ్వ విద్యాలయంలో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యాలయాన్ని ఇన్‌చార్జి వీసీ ఆచార్య దొరస్వామి బుధవారం ప్రారం భించారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న గదులను ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల కార్యాలయానికి అధికారులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్‌కుమార్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు చంద్రబాబు, కార్యదర్శి గణేష్, శ్రీనివాసులు, సుబ్రహ్మణ్యం, నారాయణ, మునస్వామి పాల్గొన్నారు.

మాజీ ఎంపీకి ఘన నివాళి



పెద్దపంజాణి, ఆగస్టు 14 : చిత్తూరు దివంగత మాజీ ఎంపీ రామక్రిష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా బుధవారం పలువురు నివాళులర్పించారు. మండలంలోని కెళవాతి గ్రామంలో రామక్రిష్ణారెడ్డి సమాధి వద్ద ఆయన కుమారుడు ఎమ్మెల్యే అమరనాథరెడ్డి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈకార్యక్రమంలో ఎమ్మెల్యే కుటుంబసభ్యులు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు. ● పలమనేరు టీడీపీ కార్యాలయంలో పలువురు టీడీపీ నాయకులు రామ క్రిష్ణా రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు.

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

పలమనేరు, ఆగస్టు 14 : పలమనేరు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆవరణలో నిరుద్యోగ యువతీ యువకులకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థచే ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వెంకటేసులు తెలిపారు. జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్, కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్‌లకు ఈ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ శిక్షణ పొందిన వారికి ఉపాధి అవకాశాలు మెండుగా ఉంటాయన్నారు. వివరాల కోసం సిసింద్రీ 84658 30771 నంబరులో సంప్రదించవచ్చని ప్రిన్సిపాల్ తెలిపారు.

అమర్‌ను కలిసిన నూతన సీఐలు

పలమనేరు, ఆగస్టు14 : గంగవరం సీఐగా, వి.కోట సీఐగా బాధ్యతలు స్వీకరించిన ప్రసాద్, సోమశేఖరరెడ్డి ఎమ్మెల్యే అమరనాథరెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. అమరనాథ రెడ్డికి పుష్పగుచ్చాలు అందజేసి శాలువలు కప్పి సన్మానించారు. కాగా గంగవరం అర్బన్ పీఎస్ సీఐగా ప్రసాద్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన కడప జిల్లా నుంచి బదిలీపై ఇక్కడకు వచ్చారు. కాగా ఇక్కడ పనిచేస్తున్న సీఐ చిన్నగోవిందు వీఆర్‌కు బదిలీ అయ్యారు.

తహసీల్దారును సత్కరించిన రేషన్ డీలర్లు

రామకుప్పం, ఆగస్టు 14: రామకుప్పం మండలం తహసీల్దారు బాబును బుధవారం మండల రేషన్ షాపు డీలర్లు సత్కరించారు. డీలర్ల సంఘం నేతలు బాబు, చంద్రకుమార్, గోపీ, పార్వతమ్మ, షఫీ, వెంకటాచలం, చౌడప్ప, తులసీరాం పాల్గొన్నారు.

తల్లిదండ్రులు మందలించారని ఆత్మహత్యాయత్నం

పుంగనూరు రూరల్, ఆగస్టు14: తల్లిదండ్రులు మందలించారని విద్యార్థి ఆత్మహత్యకు యత్నించింది. ఈ సంఘటన బుధవారం అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలంలో చోటుచేసుకుంది. రామసముద్రం మండలం మొరంపల్లెకు చెందిన శ్రీనివాసులు కుమార్తె భానుప్రియ (13) పాఠశాలకు వెళ్లకపోవడంతో తల్లిదండ్రులు మందలించారు. మనస్తాపానికి గురై ఈగల మందు తాగి స్పృహ కోల్పోయింది. గుర్తించిన తల్లిదండ్రులు చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్సలు అందించారు.

విజన్ డాక్యుమెంట్‌తో అభివృద్ధి పరుగులు

- ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం
- కుప్పం మండల మీట్‌లో ఎమ్మెల్సీ కంచర్ల



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కంచర్ల

కుప్పం, ఆగస్టు 14: విజన్ డాక్యుమెంట్ అమలుతో కుప్పం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుందని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ అన్నారు. ముఖ్యమంత్రి ఆశయాల మేరకు ఆదర్శ నియోజకవర్గంగా కుప్పం రూపొందుతుందని హామీ ఇచ్చారు. కుప్పం మండల సర్వసభ్య సమావేశం బుధవారం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు కుప్పం నియోజకవర్గానికి ప్రత్యేకంగా మ్యానిఫెస్టో విడుదల చేసిన విషయం గుర్తుచేశారు. ఈ మ్యానిఫెస్టోలోని అంశాల న్నింటినీ చేర్చి విజన్ డాక్యుమెంట్ పేరుతో కడా ఆధ్వర్యంలో అభివృద్ధి పనులకు అంచనాలు రూపొందించామన్నారు. దీన్ని త్వరలో ముఖ్యమంత్రికి సమర్పిస్తామని చెప్పారు. గత 30 ఏళ్లలో జరిగినదానికంటే రాబోయే ఐదేళ్లలో కుప్పం అత్యధికంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ఇప్పటికే మైనర్ పంచాయతీకి ఒక రూ.కోటి, మేజర్ పంచాయతీకి రూ.2 కోట్లు, మున్సిపాలిటీకి రూ.250 కోట్లు మంజూరయ్యాయని గుర్తు చేశారు. ఇంకా రూ.450 కోట్లతో అంచనాలు తయారు చేశామని, ఆ నిధులను కూడా ఇవ్వడానికి ముఖ్యమంత్రి సుముఖంగా ఉన్నారని వివరించారు. పార్టీలకు అతీతంగా కుప్పం నియోజకవర్గం, మున్సిపాలిటీ అభివృద్ధికి అందరూ సహకరించాలని కోరారు. ఇప్పటికే వివిధ పరిశ్రమల స్థాపనతోపాటు ఇతర అవసరాలకోసం వెయ్యి ఎకరాలు నియోజకవర్గ పరిధిలో గుర్తించామన్నారు. ఇంకా వెయ్యి ఎకరాలు గుర్తించాల్సిన అవసరం ఉందన్నారు. వెయ్యి ఎకరాలను పారిశ్రామికాభివృద్ధి కోసం కేటాయిస్తామన్నారు. పరిశ్రమలు, వ్యవసాయాధారిత పరిశ్రమలు వస్తే నియోజకవర్గంలో సుమారు 40 వేల నుంచి 50 వేల మందికి ఉపాధి లభిస్తుందన్నారు. టూరిజంతో అనుసంధానమైన ఆలయాల అభివృద్ధికి రూ.110 కోట్లతో అంచనాలు వేశామన్నారు. ఎంపీపీ అశ్విని మాట్లాడుతూ మల్లానూరును ప్రత్యేక మండలం చేయాలన్న ప్రతిపాదనలు పెట్టడం ఆ ప్రాంతవాసిగా తనకు ఎంతో ఆనందంగా ఉన్నదన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన అధికారులు తమ శాఖల పరిధిలో రూపొందించిన అభివృద్ధి పనుల అంచనాలు, ఇప్పటికే జరిగిన అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీడీవో ఖాదర్‌బాషా, తహసీల్దారు చిట్టిబాబు, టీడీపీ నియోకవర్గ ఇన్‌ఛార్జి పీఎస్.మునిరత్నం, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిరూపిస్తా.. రాజీనామా చేస్తారా..!

- సీడీపీవోపై ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఆగ్రహం

కుప్పం, ఆగస్టు 14: 'మీరు శాలరీస్ పెట్టలేదని నేను నిరూపిస్తా. ఉద్యోగానికి రాజీనామా చేస్తారా?' అంటూ ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, సీడీపీవో అరుణశ్రీపై ఫైర్ అయ్యారు. బుధవారం జరిగిన కుప్పం మండల సర్వసభ్య సమావేశంలో సీడీపీవో అరుణశ్రీని ఆయన 'అంగన్వాడీలకు శాలరీస్ పెట్టారా?' అని ప్రశ్నించారు. పెట్టానంటూ ఆమె సమాధానం చెప్పబోవడంతో ఎమ్మెల్సీ ఆమెపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కాగా వైసీపీ ప్రభుత్వ హయాంలో చంద్రబాబును అక్రమంగా జైల్లో పెట్టినప్పుడు కొంతమంది అంగన్వాడీలు కూడా నిరసన శిబిరాల్లో పాల్గొన్నారు. వారిని సీడీపీవో అరుణశ్రీ విధులనుంచి సస్పెండ్ చేశారు. వారితోపాటు మరికొంతమందికి వేతనాలు ఆపేశారు. దీనిపై ఎమ్మెల్సీ కంచర్లకు ఫిర్యాదులు అందడంతో ఎమ్మెల్సీ ఆమెపై ఫైర్ అయ్యారు. పొట్టకూటికోసం పనిచేసుకుంటున్న చిరుద్యోగులైన అంగన్వాడీలను ఎందుకు వేధిస్తున్నా రంటూ నిలదీశారు. ఇక నియోజకవర్గంలోని నాలుగు మండలాలకు జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద ఒక్కో మండలానికీ రూ.5 కోట్లు మంజూరయ్యాయని ఎమ్మెల్సీ చెప్పారు. కుప్పం మండలంలో ఈ నిధులను వినియోగించి అంగన్వాడీ భవనాలను నిర్మిస్తామన్నారు. అందుకు తగిన అంచనాలు తయారు చేయాలని సీడీపీవోను ఆదేశించారు. అలాగే పాఠశాలలకు ప్రహరీలు, శ్మశానాలలో నిర్మాణాలు, రోడ్లు, కాలువలు, ఇతర మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ఈ నిధులతో అంచనాలు తయారు చేసి పూర్తి చేస్తామని ఎమ్మెల్సీ తెలిపారు.

అది ముమ్మాటికీ అక్రమ క్వారీనే



ఆర్డీఓకు ఫిర్యాదు చేస్తున్న శరత్‌కుమార్

పలమనేరు, ఆగస్టు 14: పలమనేరు మండలం కొలమాసనపల్లి సమీపంలోని మాదిగ బండ వద్ద ఉన్న క్వారీని జనార్ధ న నాయుడు అనే వ్యక్తి ఆక్రమించుకొని రెండు నెలలుగా నిర్వహిస్తున్నారని దీనిపై చర్యలు తీసుకోవాలని క్వారీ యజమాని బి.శరత్‌కుమార్ పలమనేరు ఆర్డీవో మనోజ్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కేజీఎఫ్‌కు చెందిన జనార్ధన నాయుడు రాజకీయ పలుకుబడితో తనక్వారీని అక్రమంగా స్వాధీనం చేసుకో వడమే కాక తాను తయారు చేసి ఉంచిన దాదాపు 2వేల లోడ్ల జల్లిని సైతం తరలించుకు పోయారని ఆరోపించారు. రెండునెలలుగా ఎటువంటి లీజు, సెస్సులు చెల్లించకుండా అక్రమంగా క్వారీ నడుపుతున్నాడని పేర్కొ న్నారు. దీనిపై ఆర్డీవో స్పందిస్తూ తహసీల్దార్, మైనింగ్ అధికారుల నుంచి వివరాలు తెప్పించుకొని తదుపరి చర్యలు తీసుకొంటామని ఆర్డీఓ హామీ ఇచ్చారు.

క్వారీ సర్వహక్కులు నావే : జనార్ధననాయుడు



మాట్లాడుతున్న జనార్ధననాయుడు

పలమనేరు, ఆగస్టు14 : కొలమాసనపల్లి సమీపంలోని మాదిగ బండ వద్ద ఉన్న క్వారీకి సర్వ హక్కులు తనకే ఉన్నాయని, గత వైసీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే వెంకటేగౌడ, వైసీపీ నాయకులు తప్పుడు రికార్డులు సృష్టించి తన క్వారీని దౌర్జన్యంగా స్వాధీనం చేసుకొన్నారని జనార్ధన నాయుడు వివరించారు. బుధవారం పలమనేరు టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ అధికారంలోకి రాగానే అప్పటి పలమనేరు మైనింగ్ ఏడీ రాంసింగ్ ద్వారా తనపై ఒత్తిడి తెచ్చి క్వారీ జరగకుండా నిలిపించారన్నారు. బైరెడ్డిపల్లి స్టేషన్‌కు తనను పిలిపించి అప్పటి ఎస్‌ఐ, సీఐలు క్వారీని వెంకటేగౌడకు ఇప్పించేందుకు ఒత్తిడిచేశారని వివరిం చారు. క్వారీలోని తన వాహనాలను అక్రమంగా తరలించుకు పోయారని పేర్కొన్నారు. ఈ మీడియా సమావేశంలో టీడీపీ నాయకులు రామ్మూర్తినాయుడు పాల్గొన్నారు.

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి: టీడీపీ



సమావేశంలో మాట్లాడుతున్న మాధవరెడ్డి

పుంగనూరు రూరల్, ఆగస్టు14: మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పుంగనూరు టీడీపీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి పేర్కొన్నారు. బుధవారం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో మండల సమాఖ్య సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం చంద్రబాబు మహిళాభివృద్ధి కోసం మహిళాసంఘాలు ఏర్పాటు చేశారన్నారు. ప్రస్తుతం మహిళలు సంఘాలుగా ఏర్పాడి బ్యాంకుల ద్వారా కోట్లు రూపాయలు లావాదేవీలు చేస్తున్నట్లు తెలిపారు. ఏపీఎంలు రవి, సాంబశివ, శ్రీనిధి మేనేజర్ రమ్యశ్రీ, సీసీలు నాగరత్న శివశంకర్, భారతి తదితరులు పాల్గొన్నారు.

లక్ష్యం కోసం నిత్యం సాధన చేయండి : ఎస్పీ

వైభవంగా విద్యానికేతన్ కళాశాల ఫ్రెషర్స్ డే



డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు జ్ఞాపికలు, ధృవపత్రాలు అందిస్తున్న ఎస్పీ మణికంఠ చందోలు

వి.కోట, ఆగస్టు 14: ప్రతి విద్యార్థీ లక్ష్య సాధన కోసం నిత్యం సాధన చేయాలని అప్పుడే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఎస్పీ మణికంఠ చందోలు అన్నారు. బుధవారం వి.కోటలోని విద్యానికేతన్ కళాశాల ఫ్రెషర్స్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. విద్యార్థులు వారి విలువైన సమయాన్ని సెల్‌ఫోన్‌కు కేటాయిస్తూ భవిష్యత్తును అంధకారం చేసుకుంటున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల డిగ్రీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు కరస్పాండెంట్ ఎస్.ఆర్.దామోదర్‌రెడ్డి నేతృత్వంలో జ్ఞాపికలు, ధృవపత్రాలు ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. అనంతరం విద్యార్థుల నృత్య, నాట్య, కచేరి అందరినీ అలరించింది. జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, విశ్రాంత వీసీ కంకణాల రత్నయ్య, మదనపల్లె డీఎస్పీ రఘువీర్, సీఐ సోమశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ బాబు, ఎంఈవో చంద్రశేఖర్, ప్రిన్సిపాల్ మునిరత్నం, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

మువ్వన్నెల రెపరెపలు



కుప్పంలో జాతీయ పతాకం ఊరేగింపు

కుప్పం, ఆగస్టు 14: కుప్పంలో 78వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని సాయిమాతా సేవా ట్రస్టు ఆధ్వర్యంలో 550 అడుగుల పొడవు గల మువ్వన్నెల జాతీయ పతాకాన్ని బుధవారం ఊరేగించారు. ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, డీఎస్పీ పార్థసారథి, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, అర్బన్ సీఐ జీటీ.నాయుడు సాయిమాతా సేవా ట్రస్టు అధ్యక్షుడు జగదీశ్‌బాబు పాల్గొన్నారు.

సోమల: సోమల పురవీధుల్లో 500 అడుగుల జాతీయ జెండాతో బీజేపీ, జనసేన, టీడీపీ నాయకులు విద్యార్థులతో కలసి భారీ ర్యాలీ చేపట్టారు. బస్టాండ్‌లో మానవహారం నిర్వహించారు.

సదుం: స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జయకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో 66 అడుగుల మువ్వన్నెల జెండాను దేశ నాయకుల వేషధారణలోని విద్యార్థులు ప్రదర్శన చేశారు.

కల్లూరు: పులిచెర్ల మండలం కల్లూరు జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు 550 అడుగుల జాతీయజెండాతో పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కల్లూరు సీఐ లక్ష్మీనారాయణ, ఎంఈఓలు సిద్ధరామయ్య, పోకల తాతయ్య ప్రసంగించారు.

రొంపిచెర్ల: ఎంఈవో ఇందిర, ఎంఈవో-2 శ్రీనివాసులు ఆధ్వర్యంలో జెండాతో ర్యాలీ చేపట్టారు.

బైరెడ్డిపల్లె: బైరెడ్డిపల్లెలో జడ్పీబాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులతో కలసి జాతీయజెండాను చేతబట్టి ర్యాలీ నిర్వహించారు.

వి.కోట: బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షులు మైందల రామచంద్రుడు ఆధ్వర్యంలో విద్యార్థులు వీ.కోటలో జాతీయ జెండాతో ర్యాలీ చేపట్టారు.

పుంగనూరు: స్థానిక శుభారాం ప్రభుత్వ డిగ్రీకాలేజీ అధ్యాపకులు, విద్యార్థులు కలసి రాంనగర్ ప్రాంతంలో ఇంటింటా జాతీయ పతాకాలు పంపిణీ చేశారు. ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, అబ్దుల్‌కలామ్ ట్రస్ట్ సభ్యులు అయూబ్‌ఖాన్ పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం బోల్తా.. ఒకరి మృతి





వెంకటేష్ మృతదేహం, మృత్యువుకు నిలయంగా మారిన స్పీడ్ బ్రేకర్

కల్లూరు, ఆగస్టు 14: ద్విచక్ర వాహనం బోల్తాపడి ఒక వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన పులిచెర్ల మండలం కల్లూరు -సదుం మార్గమధ్యంలోని చల్లావారిపల్లి సమీపంలో జరిగింది. కల్లూరు ఎస్‌హెచ్‌ఓ ఆనంద్ కథనం మేరకు.. సోమల సంతగేటు వీధికి చెందిన పీ.వెంకటేష్ (33) బెంగళూరులో సెక్యూరిటీగా పని చేస్తున్నాడు. స్వగ్రామం సోమలకు వచ్చిన వెంకటేష్ బుధవారం తన సొంత పనుల నిమిత్తం సోమల నుంచి తిరుపతికి ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. చల్లా వారిపల్లి సమీపంలోని స్పీడ్ బ్రేకర్‌ను గమనించ లేదు. దీంతో వాహనం అదుపుతప్పి బోల్తాపడింది. వెంకటేష్ తలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు. కల్లూరు సీఐ సూర్యనారాయణ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పీలేరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

● నెల వ్యవధిలో రెండు ప్రాణాలు బలి

చల్లావారిపల్లి సమీపంలో రహదారిపై ఏర్పాటుచేసిన స్పీడ్ బ్రేకర్ వద్ద ద్విచక్రవాహనాలు బోల్తా పడిన ఘటనలో ఇప్పటికే అనేక మంది గాయపడ్డారు. కాగా నెల వ్యవధిలో ఇద్దరు మృతి చెందారు. గత నెల 19వ తేదీన చిన్నగొట్టిగల్లు మండలానికి చెందిన రత్నమ్మ తన అల్లుడితో ద్విచక్రవాహనంలో వస్తూ స్పీడ్ బ్రేకర్ వద్ద అదుపుతప్పి కిందపడటంతో తీవ్రగాయాలతో రుయాలో చికిత్సపొందుతూ మృతిచెందింది. బుధవారం సోమలకు చెందిన వెంకటేష్ అక్కడే మృతిచెందాడు. స్పీడ్ బ్రేకర్‌ను సూచించే గుర్తులు (బార్డర్లు) లేకపోవడంతో వాహనదారులు గుర్తించ లేక ప్రాణాలు కోల్పోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్పీడ్ బ్రేకర్‌ను గుర్తించేలా ఏర్పాట్లు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.

తహసీల్దారుకు టీడీపీ నేతల సత్కారం

రామకుప్పం, ఆగస్టు 14: రామకుప్పం తహసీల్దారుగా బాధ్యతలు స్వీకరించిన బాబును బుధవారం టీడీపీ ఎస్సీసెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మునస్వామి, బీసీసెల్ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి పత్ర నారాయణాచారి, తెలుగు రైతు నియోజకవర్గ అధ్యక్షుడు చలపతి, పార్టీ మండల అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఆనందరెడ్డి, నరసింహులు, మాజీ ఎంపీపీ ఆంజినేయరెడ్డిల ఆధ్వర్యంలో మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు.

ట్రాక్టర్‌కు నిప్పుపెట్టారని ఫిర్యాదు

బైరెడ్డిపల్లె, ఆగస్టు 14 : బైరెడ్డిపల్లె పెద్దచెరువు సమీపంలో తమ ఇటుకల బట్టీవద్ద వున్న ట్రాక్టర్‌కు మంగళవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పుపెట్టి కాల్చివేశారని బాధితుడు శేషేగౌడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాదాపు రూ. లక్ష నష్టం జరిగిందని వాపోయారు.

మున్సిపల్ కార్యాలయానికి బీరువా వితరణ

పుంగనూరు, ఆగస్టు14: పుంగనూరు మున్సిపల్ కార్యాలయానికి విశ్రాంత డీఎస్పీ కె.సుకుమార్‌బాబు బీరువాను బుధవారం వితరణ చేశారు. బుధవారం మున్సిపల్ కమిషనర్ నరసింహప్రసాద్‌రెడ్డికి బీరువాను అందజేశారు. తన తండ్రి, విశ్రాంత పీఈటీ డేవిడ్ పేరుపై బీరువా వితరణ చేశారు.


విద్యార్థులకు దంతపరీక్షలు

పుంగనూరు రూరల్ , ఆగస్టు14: పుంగనూరు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక తూర్పుమొగసాల మున్సిపల్ పాఠశాలలో డాక్టర్లు విద్యాధర్, కావ్యలు వైద్య దంత వైద్య శిబిరం నిర్వహించారు. 200మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. విద్యార్థులకు టూత్‌పేస్టు, బ్రెష్‌లు అందజేశారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగరాజ, ఉపాధ్యాయులు, లయన్స్ క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

మైనార్టీ ఐటీఐలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుంగనూరు రూరల్. ఆగస్టు14: పుంగనూరు గూడూరుపల్లె వద్దగల ప్రభుత్వ మైనార్టీ ఐటీఐ కళాశాలలో ప్రవేశానికి ఈ నెల 26లోపు అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ప్రిన్సిపాల్ శ్రీనివాసులురెడ్డి కోరారు. పదవ తరగతి, ఇంటర్ పాస్ లేక ఫెయిల్ అయిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు.

ఎగ్జిబిషన్ కార్మికులకు అన్నదానం



పుంగనూరు, ఆగస్టు 14: మాజీ ఎంపీ ఎన్.రామకృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా పుంగనూరులో ఎగ్జిబిషన్ వలస కార్మికులకు బుధవారం మాజీ ఎంపీ అభిమానులు అన్నదానం చేశారు. భారీ వర్షంతో ఎగ్జిబిషన్ పరికరాలు నీటమునగడంతో 30 కుటుంబాలు ఇబ్బందులు పడుతుండగా నూతనకాల్వ కుటుంబ అభిమానులు ఎస్.మధురాయల్, రమణ అన్నదానం చేశారు.

భూతగాదాలో ఒకరికి గాయాలు

పుంగనూరు రూరల్, ఆగస్టు14: భూతగాదలో ఓ వ్యక్తి గాయపడి పుంగనూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. అన్నమయ్య జిల్లా రామసముద్రం మండలం దిగువ హరిజనవాడకు చెందిన గంగులప్ప(50)కు అదే గ్రామానికి చెందిన నాగరాజ, సునీల్ కుటుంబసభ్యులకు భూతగాదాలు ఉన్నాయి. ఈ క్రమంలో బుధవారం పొలం వద్ద ఉన్న గంగులప్పపై నాగరాజ, సునీల్ దాడి చేసి గాయపరిచారు.

మంచు ముసుగు



రామకుప్పం, ఆగస్టు 14: రామకుప్పం ప్రాంతంలో వారం రోజులుగా వాతావరణం ఆహ్లాదకరంగానూ, భిన్నంగానూ ఉంటోంది. తెల్లారుజామున పొగమంచు ఆవరిస్తోంది. పగలంతా ఎండ మండుతోంది. సాయంత్రం అయ్యేసరికి వాతావరణం ఒక్కసారిగా మారిపోయి, నల్లటి మబ్బులు ఆవరించి, చల్లదనాన్ని అందిస్తోంది. అడపాదడపా రాత్రిళ్ళు చిరుజల్లులతో పాటు చెప్పుకోదగ్గ స్థాయిలో వర్షం కురుస్తోంది. రామకుప్పంతో పాటు వివిధ ప్రాంతాల్లో బుధవారం తెల్లవారుజామున 5గంటల నుంచి దట్టమైన మంచు కురిసింది. వాహనదారులు లైట్లు వేసుకుని రాకపోకలు సాగించాల్సి వచ్చింది.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వృద్ధుడి మృతి

బంగారుపాళ్యం, ఆగస్టు 14: చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో తంబుగానిపల్లి వద్ద బుధవారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వృద్ధుడు మృతి చెందాడు. వివరాలు ఇలా.. కేజీ సత్రం పంచాయతీ సీఆర్ నగర్‌కు చెందిన చెంగల్ రాయల్ (80) రోడ్డు పక్కన నడుచుకుంటూ వెళుతుండగా చిత్తూరు వైపు వెళుతున్న గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతడిని చెంగల్ చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ చెంగల్ రాయల్ మృతి చెందాడు.

విశ్రాంత ఉపాధ్యాయుడి ఆత్మహత్య

గుడిపాల, ఆగస్టు 14: మండలంలోని గురుగునత్తం గ్రామానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కోటేశ్వరరెడ్డి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఇతనికి మతిస్థిమితం సరిగ్గా లేదు. రెండ్రోజుల క్రితం నుంచి యాసిడ్ తాగాడు. వెంటనే గమనించిన కుటుంబ సభ్యులు చిత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. గుడిపాల ఎస్ఐ రామ్మోహన్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న ఆర్టీసీ బస్సు

తృటిలో తప్పిన ప్రమాదం



ఆర్టీసీ బస్సుపై విరిగిపడి ఉన్న విద్యుత్ స్తంభం

రామచంద్రాపురం, ఆగస్టు 14: ఎదురుగా వస్తున్న ట్రాక్టర్‌ను తప్పించబోయి ఆర్టీసీ బస్సు విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఘటన తిరుపతి-పచ్చికాపల్లం ప్రధాన రహదారి పీవీపురం వద్ద మంగళవారం రాత్రి జరిగింది. గ్రామస్తుల వివరాల మేరకు .. తిరుపతి ఆర్టీసీ డిపో నుంచి 35మంది ప్రయాణీకులతో తమిళనాడు రాష్ట్రం పళ్లిపట్టుకు మంగళవారం రాత్రి 9గంటలకు బస్సు బయలుదేరింది. పీవీపురం వద్ద ఎదురుగా కట్టెల లోడ్ ట్రాక్టర్ రావడంతో బస్సు డ్రైవర్ తప్పించబోయి విద్యుత్‌స్తంభాన్ని ఢీకొట్టారు. దీంతో విద్యుత్ స్తంభం విరిగి బస్సుపై పడింది. డ్రైవర్ ముందుకు వెళ్లకుండా ప్రయాణికులను కిందకు దించడంతో 35మంది సురక్షితంగా బయటపడ్డారు. ఆర్టీసీ, విద్యుత్‌శాఖ సిబ్బంది బుధవారం అక్కడికి చేరుకుని జేసీబీతో విద్యుత్ స్తంభాన్ని తొలగించారు.

సివిల్ రైట్స్ డే ఎందుకు నిర్వహించడంలేదు?

● రెవెన్యూ అధికారులపై ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడి ఆగ్రహం



తిరుపతి ఆర్డీవో కార్యాలయంలో అధికారులతో సమావేశమైన ఆనంద్ ప్రకాష్

తిరుపతి(విద్య), ఆగస్టు 14: ఎస్సీ ఎస్టీ కమిషన్ సమీక్ష సమావేశానికి రెవెన్యూ అధికారులందరూ హాజరు కాకపోవడంపై కమిషన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. తిరుపతి డివిజన్‌లో సివిల్ రైట్స్ డే నిర్వహించకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసింది. ఎస్సీ ఎస్టీ కమిషన్ సభ్యుడు చెల్లం ఆనంద్ ప్రకాష్ బుధవారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో డివిజన్లోని అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు.తొమ్మిది మండలాల తహశీల్దార్లకు ముగ్గురు మాత్రమే హాజరవడంపై కమిషన్ సభ్యుడు ఆనంద్ ప్రకాష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెలా నిర్వహించాల్సిన సివిల్ రైట్స్ డేని ఎందుకు నిర్వహించడం లేదని ప్రశ్నించారు. తిరుపతి ఆర్డీవో నిషాంత్‌రెడ్డి సమాధానం చెప్పలేక ఊరకుండిపోవడంతో ఇకనైనా నిబంధనలు పాటించండని ఆనంద్ ప్రకాష్ హితవు చెప్పారు. ప్రతి నెలా చివరి రోజున మండలస్థాయిలో సివిల్ రైట్స్ డే నిర్వహించాలని ,రెవెన్యూ, పోలీసు అధికారులు తప్పక పాల్గొని బడుగులు, బలహీనులు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకుని పరిష్కరించాలని ఆదేశించారు.జిల్లా సాంఘిక సంక్షేమశాఖ అధికారి చెన్నయ్య, అట్రాసిటీ డీఎస్పీలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు

తిరుమల, ఆగస్టు14(ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.4.35 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు రూ.4.35 కోట్లు ఆదాయం లభించినట్టు టీటీడీ బుధవారం ఉదయం ప్రకటించింది. ఇక, మంగళవారం 73,246 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. అలాగే 28,133 మంది భక్తులు శ్రీవారికి తలనీలాలు సమర్పించారు.

ఐదేళ్ల తర్వాత స్వేచ్ఛా వాయువులు!



● వైసీపీ పాలనలో ఆంక్షలు, అణచివేతలతో అన్ని వర్గాల ప్రజలూ సతమతం

స్వాతంత్ర్యదినోత్సవాన్ని పురస్కరించుకొని తడ మండలంలోని ఇరకందీవి విద్యార్థులు పులికాట్ సరస్సులో పడవపై పాఠశాలలకు వెళ్తా జాతీయ జెండాలను చేతబూని సందడి చేశారు. భారత్‌మాతాకూ జై అంటూ నినాదాలు చేశారు.

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): నేటి స్వాతంత్ర దినోత్సవ సంబరాలు జిల్లా ప్రజలకు మాత్రం ప్రత్యేకమైనవనే చెప్పాలి. గత వైసీపీ ప్రభుత్వంలో ఐదేళ్ళ పాటు అడుగడుగునా ఆంక్షలు, అణచివేతలతో జిల్లా ప్రజలు విసిగిపోయారు. ప్రతిపక్ష రాజకీయ పార్టీల శ్రేణులకు గడచిన ఐదేళ్ళ కాలం పీడకలగా పరిణమించింది. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నోరెత్తనివ్వలేదు. కనీసం తమ న్యాయమైన కోరికలు నెరవేర్చాలని ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు గట్టిగా డిమాండ్ వినిపించలేని దుస్థితి నెలకొంది.ఛలో విజయవాడకు బయల్దేరిన అంగన్‌వాడీ వర్కర్లను మార్గమధ్యంలో అర్థరాత్రి నిర్జన ప్రాంతాల్లో బస్సుల్లోంచి దింపేసిన అమానవీయ ఘటనలు జరిగాయి. విపక్ష శ్రేణులు మొదలుకుని వామపక్షాల వరకూ అందరి గొంతులూ మూగబోయాయి. స్థానిక ఎన్నికల్లో విపక్ష అభ్యర్థులు నామినేషన్లు కూడా దాఖలు చేయలేని దురవస్థ అలుముకుంది. వైసీపీ నేతలు, కార్యకర్తలు వారి నుంచీ నామినేషన్ పత్రాలు గుంజుకుని చింపేసిన సందర్భాలు, దాడులు జరిపి తరిమివేసిన ఘటనలూ అనేకం. చివరికి అధికార పార్టీకి చెందిన రెబల్ అభ్యర్థులకు సైతం ఇదే చేదు అనుభవం ఎదురైంది.చివరికి ఆయన మరో విమానంలో హైదరాబాదు వెనుదిరగాల్సి వచ్చింది. బలమైన రాజకీయ పక్షమైన టీడీపీ యువనేత నారా లోకేశ్ యువగళం వినిపించేందుకు రోడ్డెక్కడానికి సైతం ఆంక్షలు ఎదురయ్యాయి. కార్యకర్తలు మొదలు జిల్లా నేతలు సైతం హౌస్ అరెస్టుల పేరిట నిర్బంధాలు ఎదుర్కొన్నారు.నారా లోకేశ్‌పై సైతం పలు కేసులు పెట్టారు. ఆయన కనీసం స్టూలుపై కూడా నిల్చోకుండా ఆంక్షలు విధించారు.రాష్ట్రానికి 14 ఏళ్ళ పాటు సీఎంగా పనిచేసిన టీడీపీ అధినేత చంద్రబాబు 2021 మార్చి 1న తిరుపతి విమానాశ్రయం దాటి వెలుపలికి రాకుండా ఒక రోజంతా పోలీసు ఆంక్షలకు గురయ్యారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో టీడీపీ కార్యకర్తలు, నాయకులపై వైసీపీ దాడులు దౌర్జన్యాలపై చిత్తూరు కలెక్టర్, ఎస్పీలను కలిసేందుకు విమానంలో తిరుపతి వచ్చిన ఆయనను పోలీసులు వెలుపలికి రానివ్వలేదు.అధికారాన్ని అడ్డుపెట్టుకుని వైసీపీ నేతలు దాడులు, దౌర్జన్యాలు, కబ్జాలతో చెలరేగిన వైనం సామాన్య జనానికి నిదుర లేని రాత్రుల్ని మిగిల్చింది. తిరుపతి నగరంలో ఇంటి స్థలాలను, భూములను కాపాడుకోవడం యజమానులకు అలవికాని పనిగా మారింది. ఏ రాత్రి ఎవరొచ్చి స్థలాలు ఆక్రమించి కంచె వేస్తారో, రూములు కట్టేస్తారోనని నిద్ర లేని రాత్రులు గడపాల్సి వచ్చింది. ఎంతో మంది రూ. కోట్ల విలువైన స్థలాలు కోల్పోయారు కూడా. రెవిన్యూ, పోలీసు విభాగాల్లో ఎవరిని ఆశ్రయించినా న్యాయం జరిగిన దాఖలాల్లేవు. చివరికి విదేశాల్లో ఉద్యోగాలు చేసుకునే ప్రవాసులు సైతం అక్కడి నుంచే వీడియోల ద్వారా తమ ఆవేదన వెళ్ళగక్కిన ఉదంతాలూ అనేకం వున్నాయి. మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఫైళ్ళ దహనం ఘటన తర్వాత తమ భూములు కబ్జా అయ్యాయని, బలవంతంగా గుంజుకున్నారని ఆరోపిస్తూ బాధితులు వేల సంఖ్యలో క్యూ కడుతుండడమే దీనికి నిదర్శనం.ఈ నేపథ్యంలో ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికలతో ప్రభుత్వం మారడంతో అన్ని వర్గాల ప్రజానీకం ఊపిరి పీల్చుకున్నారు.గత ఐదేళ్ళుగా దూరమైన స్వేచ్ఛను తిరిగి పొందుతున్నట్టు ప్రజలు భావిస్తున్నారంటే అతిశయోక్తి కాదు.అందుకే నేటి స్వాతంత్ర దినోత్సవం జిల్లా ప్రజల పాలిట నిజంగా సంబరం.

రాయలచెరువు వంక కబ్జా

పుంగనూరులో వైసీపీ నేత నిర్వాకం ● ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు



వంక స్థలంలో అక్రమ నిర్మాణం

పుంగనూరు, ఆగస్టు 14: పుంగనూరులో విలువైన స్థలాలు, వంకలు, కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. గతంలో అధికారం ఉందనే ధైర్యంతో వైసీపీనేతలు రూ.కోట్ల విలువచేసే స్థలాలు ఆక్రమించారు.

పుంగనూరు రాయలచెరువు వర్షాలకు నిండితే వరద నీరు దోబీకాలనీ, కొత్తఇండ్లు, శ్రీచైతన్య పాఠశాల, చౌడేపల్లె రోడ్డు మీదుగా ఉన్న వంక గుండా వెళతాయి. కొంతకాలంగా రాయలచెరువు వంకను పట్టణానికి చెందిన ప్రముఖ వైసీపీ నాయకుడు ఆక్రమించారు. వైసీపీ నేతకు ఉన్న స్థలానికి పక్కనే ఉన్న వంక స్థలాన్ని ఆక్రమించి కల్యాణ మండపానికి ప్రహరీ నిర్మించుకున్నాడు. అలాగే కొంత ఆక్రమణ స్థలంలో పాఠశాల భవనాన్ని నిర్మించి అద్దెకు ఇచ్చి వంకను కలిపేశాడు. పుంగనూరు నగరపంచాయతీగా ఉన్న సమయంలో రెవెన్యూ రికార్డుల ప్రకారం ఆక్రమణ స్థలం కౌండిన్యనది, కాటమరాజుల గుడి పేరుపై ఉంది. ఆ భూమి విలువ ప్రస్తుతం కోట్ల రూపాయలుంది. కల్యాణ మండపానికి వెళ్లడానికి వంకపై నిర్మించిన వంతెన చిన్నదిగా ఉండటం, అక్కడే మలుపు ఉండటంతో పెద్దవర్షాలు వస్తే నీరు రోడ్డుపైకి వస్తున్నాయి. వంక ఆక్రమణలతో రోజురోజుకు కుంచించుకు పోతోంది. గతంలో పలువురు వంక ఆక్రమణలు, ఆలయ భూముల ఆక్రమణలపై కలెక్టర్లు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఇరిగేషన్, మున్సిపల్ అధికారులకు అనేక పర్యాయాలు ఫిర్యాదులు చేసినా కనీసం విచారణ కూడా చేయలేదు. రాయల చెరువు కాలువను వైసీపీ నాయకులు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టినా పట్టించుకోలేదు. ఎందుకంటే.. పుంగనూరులో ఏకార్యక్రమం జరిగినా నాటి మంత్రి, ఎంపీ పక్కనే ఆక్రమణలకు పాల్పడిన వైసీపీ నేతలు అత్యంత సన్నిహితంగా ఉండటమే కారణం. ఇప్పటికే పుంగనూరులో రెండు పర్యాయాలు వరదలు వచ్చి భారీగానే నష్టాలు జరిగాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని ఇప్పటికైనా తెలుగుదేశం కూటమి ప్రభుత్వం సర్వే నిర్వహించి వంక, దేవాలయ భూమిని కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

డీలర్ల వ్యవస్థ బలోపేతానికి కృషి

సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాధవరావు



తిరుపతిరూరల్, ఆగస్టు14: కూటమి ప్రభుత్వ సహకారంతో డీలర్ల వ్యవస్థ బలోపేతానికి మరింత కృషి చేస్తామని రేషన్ డీలర్స్ సంక్షేమ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు దివిలీల మాధవరావు తెలిపారు. తిరుపతిలోని డీఆర్‌డీఏ హాల్‌లో బుధవారం జిల్లా రేషన్‌డీలర్ల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన ఆయన మాట్లాడుతూ..గత వైసీపీ పాలనలో రాష్ట్రంలో డీలర్ల వ్యవస్థని నిర్వీర్యం చేసి దానికి సమాంతరంగా ఎండీయూ వ్యవస్థను తీసుకొచ్చారని విమర్శించారు. 2014-19లో సీఎంగా పనిచేసిన చంద్రబాబు రూ.20 కమీషన్‌ని రూ.70, రూ.70 కమీషన్‌ని రూ.100కి పెంచడంతోపాటు సంక్రాంతి, రంజాన్ పర్వదినాలకు తోఫా ఇవ్వడం వల్ల రాష్ట్రంలోని డీలర్లకు ఏడాదికి రూ.18కోట్ల చొప్పున ఐదుసంవత్సరాలకు రూ.90కోట్ల అదనపు ఆదాయాన్ని అందించారని గుర్తు చేశారు. తిరిగి చంద్రబాబు నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వంలో రేషన్ డీలర్ల ద్వారా సరుకులు పంపిణీ చేసి.. ఎండీయూ వ్యవస్థను రద్దుచేయాలని డీలర్లు కోరుతున్నారని తెలిపారు. సంక్షేమ కార్యక్రమాలు డీలర్ల ద్వారా అమలు పరచి కార్మికవేతన చట్టం ప్రకారం గ్రామీణ ప్రాంతాల్లో రూ.18,500, పట్టణప్రాంతాల్లో రూ.24వేల వేతనాన్ని అందించాలని ఆకాంక్షించారు. ఈపాస్ కాటాలు వినియోగంలోకి తెచ్చి డీలర్ల వేలిముద్రలతో వందశాతం తూకంతో సరకులు అందజేసేలా తగు చర్యలు చేపట్టాలని తెలిపారు. గుంటూరుజిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్, ప్రధానకార్యదర్శిలు తుమ్మలగాంధీ, పీటీఎల్ వరప్రసాద్, నెల్లూరుకి చెందిన కుమారస్వామి, డీలర్లు పాల్గొన్నారు.

పాకాలలో కోర్టు భవనాలకు ప్రారంభోత్సవం



కోర్టు భవనాలను ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి భీమారావు

పాకాల, ఆగస్టు 14: హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్,హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా అడ్మినిస్ట్రేటివ్ జడ్జి జస్టిస్ రావ్ రఘునందన్ రావు డిజిటల్ విధానంలో పాకాలలో నిర్మించిన కోర్టు భవనాలను బుధవారం ప్రారంభించారు.జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇ.భీమారావు సర్వమత ప్రార్థనలు, పూజలు చేసి న్యాయసేవలు ప్రారంభించారు. మూడు కోట్ల రూపాయల వ్యయంతో 2.45 ఎకరాల విస్తీర్ణంలో నిర్మించిన కోర్టు భవనాల ప్రారంభోత్సవంలో ఎస్పీ సుబ్బరాయుడు, ఏఎస్పీ వెంకట్రావు, ప్రోటోకాల్ జడ్జి శ్రీనివాసులు, పాకాల జూనియర్ సివిల్ జడ్జి షేక్ బాబాజాన్, కోర్టు సూపరింటెండెంట్ రాజేష్, పాకాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్.మధుసూదన రెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నరెడ్డప్పనాయుడు, కార్యదర్శి గౌరీశంకర్ రాజు, న్యాయవాదులు జి.గురుస్వామినాయుడు, సుబ్రమణ్యం రెడ్డి, ఎస్ఎస్ఎం సలీం, ప్రవీణ్ ప్రకాష్, జి.చంద్రమోహన్, మురళి, రామనారాయణ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, జిల్లా కోర్టు మేనేజర్ చాంద్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

16 నుంచీ ఐసెట్ సర్టిఫికెట్ల పరిశీలన

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఆగస్టు 14: ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశానికి చేపట్టిన ఐసెట్‌లో ర్యాంకులు పొందిన వారికి ఈ నెల 16 నుంచీ 21వ తేదీ దాకా సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టనున్నట్లు ఎస్వీయూ రిజిస్ట్రార్ భూపతి నాయుడు వెల్లడించారు. ఎస్వీయూ అడ్మిషన్ల విభాగంలో ఈ ప్రక్రియ నిర్వహిస్తారని, ఒరిజినల్ సర్టిఫికెట్లు, ఫీజుతో విద్యార్థులు హాజరు కావాలని సూచించారు.

తిరుపతి కలెక్టరేట్‌లో అర్ధరాత్రి మాక్ ఆపరేషన్



కలెక్టరేట్‌లో మాక్ ఆపరేషన్ నిర్వహిస్తున్న ఆక్టోపస్ దళాలు

తిరుపతి(కలెక్టరేట్), ఆగస్టు 14: తిరుపతి కలెక్టరేట్‌లో మంగళవారం రాత్రి 9.30గంటలకు ఆక్టోపస్ బలగాలు మాక్ డ్రిల్ నిర్వహించాయి. బిలబిలమంటూ వాహనాలు దిగి తుపాకులు చేతపట్టుకుని ఉగ్రమూకల కోసం చెరబట్టాయి. చుట్టుపక్కల ఉన్నవారికి ఇక్కడ ఏం జరుగుతుందో అర్థం కాలేదు. కలెక్టరేట్‌లో ఉన్న వారు కూడా ఏం జరిగిందో అని ఆందోళన పడ్డారు. తీరా చూస్తే ఆక్టోపస్ దళాల మాక్ డ్రిల్ అని తెలియడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఉగ్రమూకలు ఒకవేళ దాడికి ప్పాలడితే సిబ్బంది ఎలా అప్రమత్తంగా ఉండాలో కళ్లకు కట్టినట్లు పోలీసు, రెవెన్యూ, ఫైర్, మెడికల్ డిపార్ట్‌మెంట్‌తో కలిసి ఆక్టోపస్ బుధవారం అర్ధరాత్రి ఒంటి గంట వరకు మాక్ డ్రిల్ నిర్వహించింది. ఈ కార్యక్రమంలో ఆక్టోపస్ డీఎస్పీ కృష్ణ, ఇన్‌స్పెక్టర్లు రాంబాబు, రవిబాబు, రామచంద్రనాయక్, తిరుచానూరు సీఐ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



తిరుపతి మాజీ కమిషనర్ హరితపై వేటు

● టీడీఆర్ ఎఫెక్ట్



● అనంతపురం జేసీ నియామకం రద్దు

● జీఏడీకి రిపోర్ట్ చేయాలని ఆదేశం

తిరుపతి, ఆగస్టు 14 (ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో తిరుపతి కార్పొరేషన్లో జరిగిన టీడీఆర్ బాండ్ల కుంభకోణంలో బాధ్యులపై చర్యలు మొదలయ్యాయా? తిరుపతి కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన ఐఏఎస్ అధికారి డి. హరితకు అనంతపురం జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఇచ్చిన నియామకాన్ని రద్దు చేస్తూ బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా ఉన్న బాలసుబ్రమణ్యాన్ని మంగళవారం బదిలీ చేయడం కూడా ఇందులో భాగమేనంటున్నారు. ఎన్డీఏ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా హరిత ఐటీడీఏ(కేఆర్‌పురం)ప్రాజెక్ట్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. అయితే ఆమె బాధ్యతలు తీసుకోకుండా సెలవులో ఉన్నారు. ఈక్రమంలో గతవారం జరిగిన ఐఏఎస్ అధికారుల బదిలీల్లో అనంతపురం జేసీగా నియమించడంతో బాధ్యతలు తీసుకునేందుకు సన్నద్ధం అవుతుండగా టీడీఆర్ బాండ్లపై విచారణ అంశం తెరపైకి వచ్చినట్లు తెలిసింది. దీంతో ఆమె నియామకాన్ని రద్దు చేస్తూ, సాధారణ పరిపాలన శాఖ (జీఏడీ)లో రిపోర్టు చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. గతంలో తిరుపతి కమిషనర్‌గా ఉన్నప్పుడు టీడీఆర్ బాండ్ల జారీలో ఆమె పాత్రపై కూడా ఆరోపణలు వచ్చాయి.వ్యవసాయ భూమిని, రెసిడెన్షియల్ ప్లాట్లను కమర్షియల్ స్థలాలుగా చూపి మాస్టర్ ప్లాన్ రోడ్ల కోసం సేకరించారన్న విమర్శలున్నాయి. ఈ క్రమంలో కోట్లాది రూపాయలు టీడీఆర్ బాండ్ల రూపంలో చెల్లించాల్సి వచ్చింది. అదేవిధంగా స్థల యజమానికి కాకుండా వేరే వ్యక్తుల పేరిట బాండ్లను జారీ చేశారన్న ఆరోపణలు వచ్చాయి. స్థల యజమానులకు ముందస్తు నోటీసులు ఇవ్వకుండా రోడ్డు విస్తరణ చేయడం, కోర్టు ఆదేశాలను కూడా లెక్కచేయకుండా దూకుడుగా వ్యవహరించారని చెబుతారు. ఈ నేపథ్యంలో టీటీడీ మాజీ ఛైర్మన్ చదలవాడ కృష్ణమూర్తి కూడా తన గ్రూప్ థియేటర్స్ గోడను కూల్చడంపై కూడా హైకోర్టు ఆదేశాలను లెక్కచేయలేదంటూ ఆమె కోర్టు ధిక్కరణ నోటీసులు అందుకోవాల్సి వచ్చింది. అదేవిధంగా ఆమె కుటుంబ సభ్యుల ఇళ్లు, ఆస్తుల కోసమే నగరంలో పలు రోడ్లు వేశారన్న విమర్శలు కూడా ఎదురయ్యాయి. అప్పటి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి, డిప్యూటీ మేయర్ అభినయ్‌లతో అంటకాగారన్న విమర్శలు ఉన్నాయి. వారు చెప్పిందంతా చేయడం వల్లనే ఆమెకు ఇప్పుడు విచారణను ఎదుర్కొనే పరిస్థితి వచ్చిందన్న చర్చ జరుగుతోంది. ఇదిలావుంటే తాజాగా 'ఆమె టీడీఆర్ బాండ్ల రూపశిల్పి. నెల్లూరు మున్సిపల్ కమిషనర్‌గా పనిచేసినపుడు నేను చూసిన ఐఏఎస్ అధికారుల్లో హరిత అత్యంత అవినీతిపరురాలు' అని తన 'ఎక్స్'లో టీడీపీ నేత ఆనం వెంకటరమణా రెడ్డి బుధవారం పోస్టు చేయడం విశేషం.

చిత్తూరు
జీడీ నెల్లూరు/పూతలపట్టు/నగరి

మండల సమావేశానికి వైసీపీ ఎంపీటీసీల డుమ్మా


మాట్లాడుతున్న ఎంపీడీవో రామనాథరెడ్డి

పాలసముద్రం, ఆగస్టు 14: మండల సర్వసభ్య సమావేశం వాయిదా పడింది. బుధవారం ఎంపీపీ శ్యామల శివప్రకాష్ రాజు అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎంపీపీ శ్యామల శివ ప్రకాష్ రాజుతో పాటు టీడీపీ ఎంపీటీసీ జగన్నాథ రాజు మాత్రమే హాజరయ్యారు. వైసీపీకి చెందిన శ్రీకావేరిరాజుపురం, వెంగళరాజు కుప్పం, ఆముదాల, గంగమాంబాపురం, పాలసముద్రం ఎంపీటీసీలు సమావేశానికి డుమ్మా కొట్టారు. 11 గంటలకు ప్రారంభించి మూడు సార్లు వాయిదా వేసి, కోరం లేకపోవడంతో సమావేశాన్ని వాయిదా వేశారు. సమావేశానికి తహసీల్దార్ అరుణకుమారి, 12 మంది సర్పంచ్‌లు, మండల అధికారులంతా వెనుదిరిగారు.

తహసీల్దార్‌ను సత్కరించిన టీడీపీ నాయకులు



విజయపురం, ఆగస్టు 14: తహసీల్దార్ కిరణ్‌ను బుధవారం మండల ఆయన కార్యాలయంలో మండల టీడీపీ నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. మండలంలోని రెవెన్యూ సమస్యలను గురించి చర్చించారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రమేష్‌రాజు, ప్రధాన కార్యదర్శి బాబుయాదవ్, నాయకులు మునిభాస్కర్‌రాజు, పరందామనాయుడు, ఏళైమళై, వరదరాజులు తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

పాలసముద్రం, ఆగస్టు 14: మండలంలో విషజ్వరాలు ప్రబలకుండా చూడాలని ప్రాథమిక ఆరోగ్యకేంద్రం కమిటీ ఛైర్మన్ శివప్రకాష్ రాజు కోరారు. బుధవారం పీహెచ్‌సీలో ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ దోమల బెడదతో విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉందన్నారు. గ్రామాల్లో ఫాగింగ్ చేయించాలన్నారు. ఆస్పత్రిలో మందుల కొరత లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ శ్యామల, ఎంపీడీవో రామనాథరెడ్డి, డాక్టర్ మోహన్‌క్రిష్ణ, సీహెచ్‌వో జ్ఞానశేఖర్, సూపర్‌వైజర్ మురళి, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

మురుగునీటి సమస్యపై గ్రామస్థుల ధర్నా


సీఐకి సమస్య వివరిస్తున్న గ్రామస్థులు

బంగారుపాళ్యం, ఆగస్టు 14: మురుగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు బుధవారం నిరసన వ్యక్తంచేశారు. చెన్నై-బెంగళూరు జాతీయ రహదారిలో మురుగునీరు ప్రవహిస్తున్న రోడ్డుపై ధర్నా చేశారు. గంట పాటు వాహనాల రాకపోకలు స్తంభించాయి. తగ్గువారిపల్లె పంచాయతీ అండారెడ్డిపల్లి వద్ద జాతీయ రహదారిపై మూడేళ్ళుగా నీళ్ళు ప్రవహిస్తున్నా చర్యలు తీసుకోవడం లేదని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు.సీఐ లక్షుమయ్య చేరుకుని సర్దిచెప్పడంతో గ్రామస్థులు ధర్నా విరమించారు.

ఆవర్తన పట్టికతో ప్రజ్ఞాధారణ

బంగారుపాళ్యం, ఆగస్టు 14: మంగళపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో బుధవారం రసాయన శాస్త్రంలోని ఆవర్తన పట్టికలోని 118 మూలకాలపై ప్రజ్ఞాధారణ చేపట్టారు. ఆవర్తన పట్టికలోని 118 మూలకాలను 9వ తరగతి విద్యార్థి పార్థసారధి మొదటి నుంచి చివరకు, లహరి చివరి నుంచి మొదటికి ప్రదర్శించింది. విద్యార్థులను టేకుమంద సైన్స్ ఉపాధ్యాయుడు షంషీర్ ఖాన్ అభినందించారు. హెచ్‌ఎం రాజ్యలక్ష్మి,ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వరసిద్ధుడి ఆలయ అభివృద్ధికి సహకారం

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 14: కాణిపాక వరసిద్ధిని ఆలయ అభివృద్ధికి సహకారం అందించాలని ఇన్‌చార్జి ఈవో వాణి బుధవారం ఎమ్మెల్యే మురళీమోహన్‌ను కలసి కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆలయ ఉభయదారుల సమన్వయంతో ఆలయాన్ని మరింత అభివృద్ధి చేస్తామన్నారు. ఎమ్మెల్యేని ఆమె స్వామి శేషవస్త్రాలతో సత్కరించి తీర్థ ప్రసాదాలు, జ్ఞాపికను అందించారు. ఏఈవో విద్యాసాగర్‌రెడ్డి, ఆలయ ప్రధాన అర్చకుడు సోమశేఖర్‌గురుకుల్, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి


అవగాహన కల్పిస్తున్న అనిల్‌కుమార్

తవణంపల్లె, ఆగస్టు 14: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా మలేరియా అధికారి అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం దిగువమాఘంలో వైద్యసిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. దోమల వల్ల సంభవించే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. రామచంద్రారెడ్డి, సబ్‌యూనిట్ అధికారి పీర్ సాహెబ్, వైద్యాధికారి ప్రియాంక, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రైతులకు ఈ-క్రాప్ తప్పనిసరి

పెనుమూరు, ఆగస్టు 14:పంటలకు ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి అని వ్యవసాయశాఖ అధికారి సుహర్‌లత, తహసీల్దారు కల్యాణి తెలిపారు. బుధవారం వారు తహసీల్దారు కార్యాలయంలో వీఆర్‌వోలు, వీఏవోలు, వీహెచ్‌వోలతో సమావేశం నిర్వహించారు. ఆ క్రాప్ నమోదు చేసినవారికే అన్నదాత సుఖీభవ, పీఎం కిసాన్ వంటి పథకాలు అందుతాయని వారు పేర్కొన్నారు. డ్రిప్ స్ప్రింక్లర్ల సబ్సిడీ విధానాలను రైతులకు తెలియజేయాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో,డీటీ చంద్రశేఖర్, వీఆర్‌వోలు ఏహెచ్‌వోలు, వీఏవోలు, వీహెచ్‌వోలు,తదితరులు పాల్గొన్నారు.

డయల్ యువర్ ఎమ్మెల్యే వాయిదా

చిత్తూరు, ఆగస్టు 14: స్వాతంత్ర దినోత్సవ నేపథ్యంలో గురువారం డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కమిషనర్ అరుణ ఒక ప్రకటనలో తెలిపారు. వచ్చే గురువారం యథాతథంగా జరుగుతుందన్నారు. ప్రజలు ఈ మార్పును గమనించాలని కోరారు.

పాము కాటుకు వ్యక్తి మృతి


మురుగేష్(ఫైల్‌ఫొటో)

విజయపురం, ఆగస్టు 14: పాము కాటుకు ఓ వ్యక్తి మరణించాడు. ఎల్లసముద్రానికి చెందిన మురుగన్(48) బుధవారం ఉదయం కాలకృత్యాలు తీర్చుకోవడానికి పొలానికి వెళ్లాడు. అదే సమయంలో అతడిని పాము కరిచింది. ఇంటికి వచ్చిన కొంత సమయానికి తలనొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు చెప్పాడు. అతడిని ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో నోటి నుంచి నురగలు కక్కుతూ ప్రాణాలు విడిచాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఎస్‌ఐ జయప్ప కేసు నమోదు చేశారు.

సీఎంను కలిసిన బోడపాటి

శ్రీరంగరాజపురం, ఆగస్టు 14: ముఖ్యమంత్రి చంద్రబాబును బుధవారం అమరావతిలో టీడీపీ జిల్లా మాజీ ప్రత్యేక ఆహ్వానితులు బోడపాటి లోకనాథం నాయుడు మర్యాదపూర్వకంగా కలిశారు. నియోజకవర్గం అభివృద్ధి గురించి ఆయనతో మాట్లాడారు.

మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతం



తవణంపల్లె, ఆగస్టు 14: అధునాతన రోబోటిక్ పద్ధతిలో చెన్నై అపోలో హాస్పటల్‌లో నిర్వహిస్తున్న మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అపోలో వైద్యులు విజయ్‌కిషోర్‌రెడ్డి కోరారు. బుధవారం అరగొండ అపోలో హాస్పటల్‌లో నలుగురికి కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంత ప్రజల కోసం అరగొండ అపోలో ఆసుపత్రిలో తక్కువ వ్యయంతో మోకాళ్ల కీళ్ల మార్పిడి శస్త్ర చికిత్సను అందుబాటులోకి తీసుకువచ్చామన్నారు. కార్యక్రమంలో ఏవో చంద్రశేఖర్‌రెడ్డి, వైద్యులు కునాల్ పటేల్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీవోగా నీలకంఠేశ్వర్‌రెడ్డి



పెనుమూరు, ఆగస్టు 14: పెనుమూరు ఎంపీడీవోగా నీలకంఠేశ్వర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఎన్నికల విధులకు బదిలీపై వెళ్లిన ఎంపీడీవోలు తిరిగి సొంత మండలాల్లో బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ప్రకటించిన ఆదేశానుసారం ఆయన నెల్లూరు జిల్లా నుంచి పెనుమూరుకు వచ్చారు.

నింద్ర ఎంపీడీవో గా అరుణ

నింద్ర, ఆగస్టు 14: నింద్ర ఎంపీడీవోగా అరుణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఎంపీడీవోగా పనిచేస్తూ ఎన్నికల సమయంలో నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు. ఎన్నికలు ముగిసిన నేపథ్యంలో ఆమె తిరిగి నింద్ర ఎంపీడీవోగా వచ్చారు. ఇక్కడ పనిచేస్తు ఉన్న భవానీ నెల్లూరు జిల్లాకు బదిలీ అయ్యారు.

జాఫర్‌ను పరామర్శించిన దొరబాబు

చిత్తూరు సిటీ, ఆగస్టు 14: చిత్తూరు విజయ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు జాఫర్‌ను మాజీ ఎమ్మెల్సీ దొరబాబు బుధవారం పరామర్శించారు. పార్టీ అండగా ఉంటుందని, అధైర్య పడాల్సిన అవసరం లేదని చెప్పారు.

ఎస్‌ఐ మల్లికార్జునకు సన్మానం

బంగారుపాళ్యం, ఆగస్టు 14: బంగారుపాళ్యం ఎస్‌ఐ మల్లికార్జున చిత్తూరు స్పెషల్ బ్రాంచ్‌కు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా డీఎస్పీ విష్ణు రఘువీర్, సీఐ లక్షుమయ్య, పోలీసు సిబ్బంది ఆయను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఊరూవాడా మువ్వన్నెల రెపరెపలు


శ్రీరంగరాజపురం-ఐరాలలో భారీ జాతీయ పతాకాన్ని ప్రదర్శిస్తూ ర్యాలీలు


కార్వేటినగరంలో భారీ జెండాతో విద్యార్థుల ప్రదర్శన

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 14: హర్ ఘర్ తిరంగాలో భాగంగా బుధవారం పీవీకేఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసర ప్రాంతాల్లో భరత మాత వస్త్రధారణతో విద్యార్థినులు జాతీయ జెండాను చేతపట్టి ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ జీవనజ్యోతి మాట్లాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు. బీజేపీ సెంట్రల్ అధ్యక్షుడు షణ్ముగం డివిజన్‌లోని ప్రతి ఇంటికీ ఉచితంగా జాతీయ జెండాలను అందజేశారు. బుధవారం స్థానిక పోస్టాఫీసులో కొనుగోలు చేసి 37వ డివిజన్ పరిధిలో ఉచితంగా అందించారు. పార్టీ నాయకులు సురేష్, గోకుల్, ఆనంద్, గుణశేఖర్, వెంకటేష్, మధు పాల్గొన్నారు. **యాదమరి:** మండల కేంద్రంలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీని విద్యార్థులు, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు నిర్వహించారు. దేశభక్తి నినాదాలు చేశారు. సచివాలయ సంక్షేమాధికారి గీత, ఇంజనీరింగ్ అసిస్టెంట్ రాజీవ్, జడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం గిరిరాజా, వల్లేరు అమరనాథనాయుడు తదితరులు పాల్గొన్నారు. **విజయపురం:** శ్రీహరిపురం ఉన్నత పాఠశాలలో హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు జ్ఞానప్రసాద్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **ఐరాల:** మండల కేంద్రంలో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని నిర్వహించారు. రెడ్డివారిపల్లె వద్ద అమర జవాన్ చీకలప్రవీణ్‌కుమార్‌రెడ్డి విగ్రహం వద్ద పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఐరాల విద్యార్థులతో కలసి బీజేపీ నాయకులు జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ నాయకులు జగదీశ్వర్‌నాయుడు, భానుప్రకాష్, కుమార్, రాజేష్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రమణ, చిట్టిబాబు, రంజిత్ రెడ్డి, లోకనాథరెడ్డి, వాసుదేవరెడ్డి, జనసేన నాయకుడు పాల్గొన్నారు. **శ్రీరంగరాజపురం:** మండల కేంద్రంలో జడ్పీ ఉన్నత పాఠశాల నుంచి విద్యార్థులు మండల విద్యాశాఖ అధికారి అరుణాచాలం రెడ్డి ఆధ్వర్యంలో 500 వందల అడుగుల జాతీయ పతాకంతో ర్యాలీ నిర్వహించారు. ఎస్‌ఐ కుళాయిప్ప, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం పురవీధుల్లో భారీ పరిమాణమున్న మువ్వన్నెల జెండాను విద్యార్థులు ప్రదర్శించారు. 750 అడుగుల పొడవు ఉన్న జెండాను విద్యార్థులు ప్రదర్శనగా తీసుకెళ్లారు. కార్వేటినగరం ప్రభుత్వ పాఠశాలలో స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. ఎంపీపీ లత, విద్యాశాఖ సిబ్బంది హాజరయ్యారు.

బాధ్యతగా బ్రహ్మోత్సవాల నిర్వహణ: ఇన్‌చార్జి ఈవో


అధికారులకు సూచనలు ఇస్తున్న వాణి

ఐరాల(కాణిపాకం), ఆగస్టు 14: ఆలయ ఉద్యోగులంతా ఐక్యమత్యంగా వార్షిక బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని ఇన్‌చార్జి ఈవో వాణి అన్నారు. ఇన్‌చార్జి ఈవోగా బాధ్యతలు తీసుకున్న అనంతరం బుధవారం ఉద్యోగులు, అర్చక, వేద పండితులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఈవో మాట్లాడుతూ సామాన్య భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా దర్శనం కల్పించాలన్నారు. తనిఖీల సందర్భంలో తప్పులు గుర్తిస్తే వెంటనే శాఖా పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వార్షిక బ్రహ్మోత్సవాల్లో బాధ్యతగా పని చేయాలని సూచించారు. ఈఈ వెంకటనారాయణ, ఏఈవో రవీంద్రబాబు, విద్యాసాగర్‌రెడ్డి, ధనంజయ, సూపరింటెండెంట్లు వాసు, మల్లికార్జున, రంగస్వామి, అర్చక, పండితులు పాల్గొన్నారు.

సైబర్‌నేరాలపై అనుక్షణం అప్రమత్తం: ఎస్పీ


మాట్లాడుతున్న ఎస్పీ మణికంఠ

చిత్తూరు, ఆగస్టు 14: సైబర్ నేరాలు, మాదక ద్రవ్యాలపై పోలీసు శాఖ అవగాహన వాకథాన్ ర్యాలీని నిర్వహించింది. ఈ సందర్భంగా గాంధీ విగ్రహ కూడలి వద్ద ఎస్పీ మణికంఠ మాట్లాడుతూ వ్యక్తిగత సమాచారాన్ని రక్షించుకోకుంటే సైబర్ నేరగాళ్లు దోచుకోవడానికి సిద్ధంగా ఉంటారన్నారు. మాదక ద్రవ్యం వినియోగం వల్ల జ్ఞాపకశక్తి నశించి పోతుందన్నారు. అనేక వ్యాధులకు గురవుతారన్నారు. సైబర్ క్రైమ్, మాదకద్రవ్యాల అమ్మకాలు, వినియోగం గురించి సమాచారం తెలిస్తే డయల్ 100, సైబర్ క్రైమ్ నెంబరు 1930, మాదకద్రవ్యాలపై 14500 నెంబర్లకు ఫిర్యాదు చేయాలని సూచించారు. అనంతరం ఎస్పీ వాకథాన్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఏఎస్పీలు ఆరీఫుల్లా, నాగేశ్వరరావు, డీఎస్పీలు రాజగోపాల్‌రెడ్డి, మహబూబ్‌బాష, ఇలియాస్ బాష, సీఐలు, ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూనియర్ డాక్టర్ హత్యకు నిరసనగా కొవ్వొత్తుల ర్యాలీ



చిత్తూరు రూరల్, ఆగస్టు 14: కోల్‌కత్తా ఆర్‌జీ కర్ వైద్య కళాశాలలో జూనియర్ డాక్టర్ హత్యకు నిరసగా బుధవారం చిత్తూరు అపోలో యూనివర్సిటీ ఎదుట వైద్యులు కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. హత్యకు కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అపోలో యూనిట్ హెడ్ నరేష్‌రెడ్డి, కళాశాల డీన్ ఆల్ఫ్రెడ్ జే అగస్టిన్, వైద్యులు, పీజీ విద్యార్థులు పాల్గొన్నారు.

సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి : ఎమ్మెల్యే గురజాల


మాట్లాడుతున్న ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 14: జిల్లా కేంద్రంలో సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ తెలిపారు. బుధవారం స్థానిక లిటిల్ ఫ్లవర్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో జిల్లా సైన్స్ అధికారి రమణ అధ్యక్షత జరిగిన ఇన్‌స్పైర్ గైడ్ టీచర్ల శిక్షణా కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జిల్లా విభజన నేపథ్యంలో చిత్తూరు జిల్లా కేంద్రంగా సైన్స్ మ్యూజియం ఏర్పాటుకు తనవంతు కృషి చేస్తామన్నారు. జిల్లా సైన్స్ అధికారి రమణ మాట్లాడుతూ ఏడాది ఇన్‌స్పైర్ మనక్‌కు ఎక్కువ మంది విద్యార్థుల నుంచి నామినేషన్లు వేయించాలన్నారు. డీవైఈవో చంద్రశేఖర్, ఎన్‌జీసీ జిల్లా సమన్వయకర్త బాలచైతన్య, పూర్వ సైన్స్ అధికారి శశిధర్, కోఆర్డినేటర్ సుధాకర్, నందకుమార్, బావాజాన్, సైన్స్ గైడ్ టీచర్లు పాల్గొన్నారు. గుడిపాలలో ఎమ్మెల్యే అన్నక్యాంటీన్‌ను ఏర్పాటుకు స్థలాన్ని ఎమ్మెల్యే పరిశీలించారు.

మారియమ్మ సేవలో ఎమ్మెల్యే



యాదమరి, ఆగస్టు 14: జొన్నాలమిట్టలో మారియమ్మ ఆలయంలో బుధవారం జరిగిన మహా కుంభాభిషేకం కార్యక్రమంలో స్థానిక ఎమ్మెల్యే మురళీమోహన్ పాల్గొన్నారు. ఆయనకు స్థానిక నేతలు స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు, హోమంలో ఎమ్మెల్యే పాల్గొని అమ్మవారి ఆశీస్సులు అందుకున్నారు. వేద ఆశీర్వాచనానంతరం తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో మండల నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

ప్రతీ ఒకరూ జెండాను ఎగుర వేయాలి


జెండాలను ప్రదర్శిస్తున్న పాముల శేషాద్రికుమార్

వెదురుకుప్పం, ఆగస్టు 14: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం ప్రతీ ఒకరూ మువ్వన్నెల జెండాను ఎగువ వేయాలని ఎస్సీ మోర్చా జిల్లా ప్రధానకార్యదర్శి పాముల శేషాద్రికుమార్ కోరారు. బుధవారం దామరకుప్పంలో ఆయన మువ్వన్నెల జెండాలను ప్రదర్శించారు. బీజేపీ నాయకులు హనుమంతరెడ్డి, ప్రభాకరరాజు, సుజాత పాల్గొన్నారు.

అలరించిన చిన్నారుల వేషధారణ


దేశనాయకుల వేషధారణలో విజయం చిన్నారులు

చిత్తూరు (సెంట్రల్), ఆగస్టు 14: స్వాతంత్ర్యం కోసం ప్రాణాలు అర్పించిన సమరయోధులను స్మరించుకోవాలని విజయం విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ శైలజ మూర్తి అన్నారు. హర్‌ఘర్‌తిరంగాలో భాగంగా బుధవారం పాఠశాలలోని కిన్నర్‌గార్టన్ చిన్నారుల వేషధారణలు అలరించాయి. బాల్యం నుంచే దేశభక్తి భావన పెంచడమే లక్ష్యంగా తీర్చిదిద్దాలని డైరెక్టర్ పేర్కొన్నారు. హెచ్‌ఎం శ్రీదేవి, ఉపాధ్యాయులు, చిన్నారులు పాల్గొన్నారు. ● హార్వర్డ్ స్కూల్ పాఠశాలలో విద్యార్థులకు టైక్వాండో, కరాటే, తదితర పోటీలు నిర్విహించారు. విజేతలకు పాఠశాల డైరెక్టర్ త్రివేణితో కలిసి కరస్పాండెంట్ భాస్కర్ బహుమతులు ప్రదానం చేశారు.

గుడిపాల ఎస్‌ఐగా రామ్మోహన్



గుడిపాల, ఆగస్టు 14: గుడిపాల ఎస్‌ఐగా రామ్మోహన్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ ఇన్‌చార్జి ఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న నరేంద్రకుమార్ అనంతపురానికి బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో రామ్మోహన్ బాధ్యతలు చేపట్టారు.

ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు సహకారం: గురజాల


సమస్యలు వివరిస్తున్న ఎంపీటీసీ హరిప్రసాద్

గుడిపాల, ఆగస్టు 14: ఆదర్శ మండలంగా తీర్చిదిద్దేందుకు అధికారులు, నాయకులు సహకరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్ అన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చీలాపల్లి సర్పంచ్ అరుణ్ మాట్లాడుతూ అసంపూర్తి భవనాలను పూర్తిచేయాలన్నారు. గొల్లపల్లి సర్పంచ్ అరుణ మాట్లాడుతూ తాగునీటి బోర్లు వేసినా పట్టించుకోదన్నారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సర్పంచులు ప్రస్తావించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. వైస్‌ఎంపీపీలు జయప్రియ, గోపి పాల్గొన్నారు. సమావేశానికి హాజరుకాని ఆర్‌అండ్‌బీ, సెరికల్చర్ శాఖల అధికారులకు మెమో జారీచేశారు.

అధికారం అడ్డుపెట్టుకుని జోగి దోపిడీ: టీడీపీ


మాట్లాడుతున్న సీఆర్ రాజన్,నాయకులు

చిత్తూరు సిటీ, ఆగస్టు 14: అగ్రిగోల్డ్ బాధితులందరికీ అండగా ఉంటానని మాయమాటలు చెప్పిన జోగి రమేష్, ఆయన కుమారుడు రాజీవ్‌లు భారీగా దోచుకున్నారని టీడీపీ జిల్లా అధ్యక్షుడు సీఆర్ రాజన్ ఆరోపించారు. బుధవారం స్థానిక జిల్లా టీడీపీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో కార్యాలయ కార్యదర్శి మోహన్‌రాజ్, పార్టీ నాయకులు విజయ్‌కుమార్, సుధాకర్ నాయుడులతో కలసి పాల్గొన్నారు. రాజన్ మాట్లాడుతూ అధికారాన్ని అడ్డుపెట్టుకుని జోగిరమేష్, ఆయన కుటుంబ సభ్యులు తప్పుడు రికార్డులతో అనుకూలంగా జీవోలు, పత్రాలు మార్చుకుని ప్రభుత్వాన్ని మోసం చేశారన్నారు.

పంచాయతీల అభివృద్ధిపై ముగిసిన శిక్షణ

నింద్ర, ఆగస్టు 14: గ్రామ పంచాయితీ అభివృద్ధిపై సర్పంచ్‌లకు, కార్యదర్శులకు మూడు రోజులుగా నిర్వహించిన శిక్షణ బుధవారం ముగిసిందని ఎంపీడీవో అరుణ తెలిపారు. పంచాయితీలో పారిశుధ్యం ఆర్థిక వనరులు, డంపింగ్ యార్డ్ తదితర వాటిపై శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్‌గా పురుషోత్తం, ఈవోపీఆర్‌డీ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. **వెదురుకుప్పం:** కార్వేటినగరం ఎంపీడీవో కార్యాలయం జరిగిన సర్పంచులు, గ్రామకార్యదర్శుల శిక్షణ తరగతులు బుధవారం ముగిశాయి. ఈ నెల 12 నుంచి శిక్షణ తరగతులను నిర్వహించారు. వివిధ అంశాలపై ఇన్‌చార్జి ఎంపీడీవో లక్ష్మిపతి వివరించారు. ఎంపీపీ లత హాజరయ్యారు. **గుడిపాల:** మండలంలోని పంచాయతీల అభివృద్ధిపై సర్పంచులకు శిక్షణా కార్యక్రమం నిర్వహించినట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో ఉపేంద్ర, కోఆర్డినేటర్ శ్రీనివాసులు తెలిపారు. శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.